సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి...




సోమవారం31 , మార్చి 2025 8 పేజీలు

# ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

### జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్



కొత్తగూడెం కలెక్టరేట్, సూర్య(మేజర్ న్యూస్) - రంజాన్ పండుగ ముస్లీం మతస్థులకు అతిపెద్ద పండుగ. నెలవంక దర్శనంతో పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసంలో ముస్లింలు కఠోర ఉపవాస దీక్షలు, ప్రార్థనలు, క్రమశిక్షణ పాటిస్తారని ఆయన గుర్తు చేశారు. రంజాన్ మాసం ఆదర్శ వంతమైన జీవనానికి ప్రేరణ ఇస్తుందని కలెక్టర్ అన్నారు. ముస్లిం సోదరులు రంజాన్ మాస వేడుకలను సుఖసంతోషాలతో నిర్వహించుకోవాలని ఆయన కోరారు.




# ఆగయా ఈదుల్ ఫితర్



భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, సూర్య(మేజర్ న్యూస్)- అల్లాహు అక్బర్ .. అల్లాహు అక్బర్ .. లాయిలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హంద్ ..! ఈ రోజు ఎటువిన్నా ఈ స్తోత్ర గానమే, ఆ దయామయుని కీర్తిగానమే వినిపిస్తూ హృదయాలను పులకింపజేస్తూ ఉంటుంది. ఊరు, వాడ, పల్లె, పట్నం, చిన్నా పెద్దా, ఆడా మగా, ముసలీ ముతకా అనే తేడా లేకుండా ఎవరి నోట విన్నా ఈ అమృత వచనాలే జాలువారుతూ ఉంటాయి. కొత్తబట్టలు, కొత్తహంగులు, తెల్లని టోపీలు మల్లెపూలలా మెరిసిపోతుంటాయి. అత్తరు పన్నీరు పరిమళాలు, అస్సలాము అలైకుం, ఈద్ ముబారక్లు, చిరునవ్వుల కరచాలనాలు, ఆలింగనాల ఆనంద తరంగాలు, అలయ్ బలయ్ లతో విశ్వాసుల హృదయాలు సంతోషసాగరంలో ఓలలాడుతూ ఉంటాయి. సేమ్యాలు, షీర్ ఖుర్మాలు, బగారా, బిర్యానీల ఘుమఘుమలతో, ఉల్లాస పరవళ్ళ హడావిడితో ముస్లిముల లోగిళ్ళు కిలకిల నవ్వుతూ, కళకళలాడుతూ ఉంటాయి. ఇళ్ళలో ఆడాళ్ళ హడావిడికి, పిల్లల సందడికి హద్దులే ఉండవు. ఎందుకంటే ఇది ఒక్కనాటి పండుగ కాదుగదా! నెల్లాళ్ళపాటు భక్తిప్రపత్తులతో జరుపుకున్న పండుగకు అల్విదా చెబుతున్న ముగింపు ఉత్సవం. రమజాన్ నెలరోజులూ ముస్లింల వీధులు 'సహెరీ', 'ఇఫ్తార్' ల సందడితో నిత్యనూతనంగా కొత్తశోభతో అలరారుతుంటాయి. మసీదులన్నీ భక్తులతో కిటకిటలాడుతూ, ప్రేమామృతాన్ని చిలకరిస్తూ వింత అనుభూతుల్ని పంచుతుంటాయి.

వివరాలు 2లో..



# జూన్ నెలలో గోదావరి జలాలతో సాగు ప్రారంభించేలా చర్యలు

### రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు



- ఆగస్టు 15 నాటికి జాతీయ రహదారి పనులు పూర్తి
- లాభసాటి పంట ఆయిల్ పామ్ వైపు రైతులు దృష్టి సారించాలి
- ఆయిల్ పామ్ పంటకు మద్దతు ధర కల్పించాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి
- వేంసూరు మండలం కల్లూరు గూడెంలో నూతన ఆయిల్ పామ్ కర్మాగారానికి శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల

2లో

ఉగాది మరియు రంజాన్ పర్వదిన
శుభాకాంక్షలు
ఖమ్మం రూరల్ మండల ప్రజలకు, రైతులకు, ప్రజాప్రతినిధులకు, మిత్రులకు, అధికారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
ఉగాది మరియు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు
రాంప్రసాద్, యంఆర్ఓ
ఆర్ఐలు : ప్రసాద్, క్రాంతి
సింగారపు కుమార్,యంపిడిఓ
గ్రామపంచాయతీ కార్యదర్శులు
విద్యుత్‌శాఖ ఏఈలు
ప్రభాకర్‌రావు, రామారావు, దివ్వేల
వ్యవసాయశాఖాధికారులు
ఉమేష్‌చంద్ర, ఏఓ
ఏఈఓలు

# ఆగయా ఈదుల్ ఫిత్

మొదటి పేజీ తరువాయి

భక్తులు పవిత్ర గ్రంథ పారాయణా మధురిమను గ్రోలుతూ వినూత్న అనుభూతులతో పరవశించి పోతుంటారు. అవును.... ఇలాంటి అనుభూతులు, ఆనందాలు, ఆహ్లాదాలు, అనుభవాలు, అనుభూతుల సమ్మేళనమే పండుగ. ఇలాంటి ఓ అద్భుతమైన, అపురూప సందర్భమే ఈదుల్ ఫిత్. దీన్నే రమజాన్ పండుగ అంటారు. ముస్లిం సమాజం జరుపుకునే రెండు ముఖ్యమైన పండుగల్లో ఇది మొదటిదీ, అతి పవిత్రమైనదీను. ఈ నెలలో ముస్లింలు అత్యంత నియమనిష్టలతో రోజావ్రతం పాటిస్తారు. భక్తిశ్రద్ధలతో రోజూ ఐదుసార్లు నమాజ్ చేస్తారు. పవిత్రఖురాన్ గ్రంథాన్ని భక్తితో పారాయణం చేస్తూ, దాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. ముహమ్మద్ ప్రవక్త(స)వారిపై సలాములు పంపుతూ ఉంటారు. దైవనామస్మరణలో అనునిత్యం వారి నాలుకలు నర్తిస్తూ ఉంటాయి. ప్రతిరోజూ తరావీహ్ నమాజులో పాల్గొని తన్మయులవుతుంటారు. దానధర్మాలు చేస్తారు, ఫిత్రాలు చెల్లిస్తారు. ఈ విధంగా రమజాన్ చంద్రవంక దర్శనంతో ప్రారంభమైన ఉపవాసదీక్షలు నెలరోజుల తరువాత షవ్వాల్ మాసం నెలవంక దర్శనంతో సమాప్తమవుతాయి. షవ్వాల్ మొదటితేదీన జరుపుకునే 'ఈదుల్ ఫిత్' పర్వదినాన్నే మనం రమజాన్ పండుగ అంటున్నాము. ఈ పండుగ సంబంధం రమజాన్ నెలతో ముడివడి ఉన్న కారణంగా ఇది రమజాన్ పండుగగా ప్రసిద్ధి చెందింది. రమజాన్ ఉపవాస దీక్షలు, పవిత్ర ఖురాన్ అవతరణతో దీని సంబంధం పెనవేసుకు పోయి ఉంది. మానవుల్లో దైవభక్తిని, దైవభీతిని, సదాచారాన్ని, మానవీయ విలువల్ని జనింపజేయడానికి సృష్టికర్త ఉపవాస వ్రతాన్ని విధిగా నిర్ణయించాడు. దైవాదేశ పాలనకు మనిషిని బద్ధునిగా చేయడమే ఉపవాస దీక్షల అసలు లక్ష్యం. ఒక నిర్ణీత సమయానికి మేల్కొనడం, సూర్యోదయం కాకముందే భుజించడం(సహెరి), సూర్యాస్తమయం వరకూ పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టకుండా, రోజూ ఐదుసార్లు దైవారాధనచేస్తూ సూర్యాస్తమయం తరువాత రోజా విరమించడం(ఇఫ్తార్), మితాహారం తీసుకోవడం, మళ్ళీ అదనపు ఆరాధనలు అంటే తరావీహ్ నమాజులు చేయడం, మళ్ళీ తెల్లవారు ఝామున లేవడం – ఈవిధంగా రమజాన్ ఉపవాస వ్రతం మనిషిని ఒక క్రమశిక్షణాయుతమైన, బాధ్యతాయుతమైన, దైవభక్తి పరాయణతతో కూడుకున్న జీవనవిధానానికి అలవాటు చేస్తుంది. మానవుల్లో ఇంతటి మహోన్నత విలువలను, సుగుణాలను జనింపజేసే వ్రతాన్ని పరాత్పరుడైన అల్లాహ్ వారికి అనుగ్రహించినందుకు, వాటిని వారు నెలరోజులూ త్రికరణ శుద్ధిగా పాటించ గలిగినందుకు సంతోష సంబరాల్లో తేలిపోతూ కృతజ్ఞతాపూర్వకంగా భక్తి శ్రద్ధలతో పండుగ జరుపుకుంటారు.

మరో ముఖ్య విషయం ఏమిటంటే, పవిత్ర రమజాన్ నెలలోనే సమస్త మానవాళి సన్మార్గ దీపిక అయిన మహత్తర గ్రంథరాజం ఖురాన్ను దేవుడు మానవాళికి ప్రసాదించాడు. సమస్త మానవజాతికీ మార్గదర్శక జ్యోతి పవిత్ర ఖురాన్. సన్మార్గం చూపే, సత్యాసత్యాలను వేరుపరిచే స్పష్టమైన ఉపదేశాలు ఇందులో ఉన్నాయి. ఈ గ్రంథరాజం మానవులందరికీ సన్మార్గ బోధన చెయ్యడానికి అవతరించిన ప్రబోధనా జ్యోతి. దైవ ప్రసన్నతను చూరగొనడానికి రోజా పాటించడం, 'తరావీహ్ 'లు ఆచరించడం, దానధర్మాలు చేయడంతో పాటు, ఈ నెల చివరిలో'లైలతుల్ ఖద్ర్' అన్వేషణలో అధికంగా ఆరాధనలు చేస్తారు. లైలతుల్ ఖద్ర్ అంటే అత్యంత అమూల్యమైన రాత్రి అని అర్థం. ఉపవాసం పాటించడంవల్ల పేదవాళ్ళ ఆకలి బాధలు అర్థమవుతాయన్నారు. సంపన్నులకు, ముప్పూటలా సుష్టుగా తినేవారికి నిరుపేదల ఆకలికేకలు వినబడవు. అలాంటివారు గనక ఉపవాసం పాటించినట్లయితే ఆకలి బాధ ఎలా ఉంటుందో వారికీ తెలుస్తుంది. తద్వారా పేదసాదలను ఆదుకోవడం, వారికి పట్టెడన్నం పెట్టడం ఎంతగొప్ప పుణ్యకార్యమో వారు అనుభవపూర్వకంగా తెలుసుకోగలుగుతారు. ఈ విధంగా రమజాన్ నెల ఆరంభంనుండి అంతం వరకు ఒక క్రమపద్ధతిలో ధర్మం చూపిన బాటలో నడుస్తూ, దైవప్రసన్నత, పుణ్యఫలాపేక్షతో ఈనెలను గడిపినవారు ధన్యులు. నిజానికి ఇలాంటివారే పండుగ శుభకామనలకు అర్హులు. అందుకే ఈద్ (పండుగ)ను శ్రామికుని వేతనం(ప్రతిఫలం)లభించే రోజు అని చెప్పడం జరిగింది. ఈ విధంగా రమజాన్ పర్వదినం మనిషిని ఒక ఉన్నతమానవీయ విలువలుకలవాడుగా తీర్చిదిద్ది, సమాజంలో శాంతి, సమానత్వం, సామరస్యం, సోదర భావాలకు పునాదివేస్తుంది. ప్రేమ తత్వాన్ని ప్రోదిచేస్తుంది. ఇదే ఈదుల్ ఫిత్ . రమజాన్ పర్వదిన పరమార్థం. సదాచరణల సంపూర్ణప్రతిఫలం లభించిన సంతోషంలో అంబరాన్నంటేలా సంబురాలు జరుపుకొని ఆనంద తరంగాల్లో తేలియాడే రోజు ఈదుల్ ఫిత్ ఆరోజు ముస్లిములందరూ ఈద్ నమాజ్ ముగించుకొని పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుంటారు. పండుగకు ప్రత్యేకంగా తయారు చేసిన సేమియా పాయసాన్ని తమ హిందూ, ముస్లిం, క్రైస్తవ, సిఖ్ఖు సోదరులందరికీ ఆప్యాయంగా రుచి చూపించి తమ ఆనందాన్ని వారితో పంచుకుంటారు. ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలుతెలుపుకుంటూ ఆత్మీయంగా ఆలింగనాలు చేసుకుంటారు. పవిత్ర ఖురాన్ రూపంలో అవతరించిన సృష్టికర్త మహదనుగ్రహం దానవుడి లాంటి మానవుణ్ణి దైవదూతగా మలిచింది. అజ్ఞానం అంధకారాల కారు చీకట్లనుండి వెలికి తీసి, విజ్ఞానపు వెలుగుబాటకు తీసుకు వచ్చింది. నైచ్యపు అగాథాలనుండి పైకిలాగి పవిత్రతా శిఖరాలపై నిలిపింది. మానవుల్లోని పశుప్రవృత్తిని మానవీయ పరిమళంతో పారద్రోలింది. ఆటవికతను నాగరికతతో, అజ్ఞాన తిమిరాన్ని జ్ఞానదీపికతో, అవివేకాన్ని వివేకంతో పారద్రోలి మనుషుల్ని మానవోత్తములుగా సర్వతోముఖంగా తీర్చిదిద్దింది. మానవాళికి ఇంతటి మహదానుగ్రహాలు ప్రసాదించి, వారి ఇహపరలోకాల సఫలతకు పూబాటలు పరిచిన నిఖిల జగన్నాయకునికి కృతజ్ఞతాభివందనాలు చెల్లించుకోవడమే ఈ పండుగ ఉద్దేశ్యం.

## జూన్ నెలలో గోదావరి జలాలతో సాగు ప్రారంభించేలా చర్యలు











**ఖమ్మం, మార్చి -30 :** వర్షాలతో సంబంధం లేకుండా ఖమ్మం జిల్లా రైతులు జూన్ నెలలో గోదావరి జలాలతో సాగు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటు న్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం వేంసూరు మండలం కల్లూరుగూడెంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, టి.జి. ఆయిల్ ఫెడ్ ఎండి యాస్మిన్ బాషా, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డిలతో కలిసి నూతన ఆయిల్ పామ్ కర్మాగార పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రతి పనికి ఆటంకాలు ఎదురవుతాయని, ఆయిల్ ఫెడ్ నుంచి ఇచ్చే ఏ మొక్కలు కూడా కల్తీవి లేవని, నర్సరీ దశలోనే కల్తీ మొక్కలు కనిపెట్టడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సత్తుపల్లిలో అభివృద్ధి పనులు ప్రత్యేక శ్రద్ధతో చేపట్టడం జరుగుతుందని అన్నారు. వేంసూరు మండలంలో రైతులకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో గతంలో ఎన్టిఆర్ కాలువ పూర్తి చేశామని అన్నారు. రాజీవ్ లింక్ కాలువ పూర్తి చేసి వైరా నియోజకవర్గ పరిధిలో సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు అందించామని అన్నారు. జూన్ నెలలోపు సత్తుపల్లి ప్రాంతానికి గోదావరి జలాలు తీసుకొని వస్తామని, నాగార్జున సాగర్ నిండకపోయినా గోదావరి నీటితో వేంసూరు మండల చెరువులు నింపు తామని అన్నారు. వర్షాలతో సంబంధం లేకుండా ఖమ్మం జిల్లాలో 10 లక్షల ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు అందేలా సీతారామ ఎత్తిపోతల పథకం నీటి సరఫరా చేసేందుకు పెండింగ్ పనులకు సవరించిన అంచనాలను సీఎం ఆమోదించారని అన్నారు. జాతీయ రహదారుల, ఆయిల్ పామ్ పంటల వృద్ధి ఖమ్మం జిల్లాను చూసి ఇతర జిల్లాలు నేర్చుకోవాలని అన్నారు. ఖమ్మం నుంచి 33 నిమిషాలలో సత్తుపల్లికి వచ్చేలా కల్లూరు, వేంసూరు జాతీయ రహదారి ఎగ్జిట్ ఏర్పాటు చేశామని, ఆగస్టు 15 నాటికి ఈ పనులు పూర్తి అవుతాయని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ గత ప్రభుత్వ పథకాలు కొనసాగిస్తూ రైతుల ఖాతాలలో 33 వేల కోట్లను సీఎం రేవంత్ రెడ్డి జమ చేశారని అన్నారు. రైతు భరోసా భవిష్యత్తులో ఇచ్చిన హామీ మేరకు చేస్తామని అన్నారు. పంటల భీమా పథకం త్వరలోనే ప్రభుత్వం ప్రారంభిస్తుందని, ఎటువంటి కారణాలతో పంట నష్టపోయినా పరిహారం అందేలా కృషి చేస్తామని అన్నారు. ఆయిల్ పామ్ పంటకు గిట్టుబాటు ధర 21 వేలు దాటే విధంగా అధికారులు కృషి చేయాలని మంత్రి సూచించారు. హార్టికల్చర్ వ్యవసాయ సాగు వైపు రైతులు దృష్టి సారించాలని మంత్రి తెలిపారు. ఈ సంవత్సరం ఎక్కువ ఆయిల్ పామ్ పంట సాగు ప్రారంభమైందని, రాబోయే 10 సంవత్సరాలలో 20 లక్షల ఎకరాలలో ఆయిల్ ఫామ్ పంట సాగు చేయాలని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ పంటకు కరువు, వరదలతో ఇబ్బందులు లేవని, 3 సంవత్సరాలలో పంట వచ్చే మొక్కలు అందిస్తున్నామని, రైతులు ఆలోచించి ఆయిల్ పామ్ పంట సాగు చేయాలని, పంట సాగు పెరిగే కొద్దీ అవసరమైన ఫ్యాక్టరీలను ప్రతి జిల్లాలో ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీతో రైతులకు మంచి రేటు లభిస్తుందని, గతంలో కూడా ఈ ఫ్యాక్టరీ ప్రైవేట్ పరం కాకుండా కాపాడామని అన్నారు. ఆయిల్ పామ్ పంటకు సైతం కనీస మద్దతు ధర ప్రకటించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొని వస్తామని అన్నారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ, రైతులకు లాభం జరగాలనే ఉద్దేశంతో ఆయిల్ పామ్ పంటను మంత్రి తుమ్మల ప్రోత్సహిస్తున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వేంసూరు మండల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నారని, కల్లూరుగూడెం గ్రామంలో ఏర్పాటు చేసే ఫ్యాక్టరీ వచ్చే ఉగాది నాటికి పూర్తి అవుతుందని, నేరుగా 100 నుంచి 200 మంది యువతకు ఉపాధి లభిస్తుందని, పరోక్షంగా వేలాది రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. ఆయిల్ పామ్ పంటకు ప్రభుత్వం అనేక రకాల సబ్సిడి అందిస్తుందని, 4 సంవత్సరాల కాలంలో దాదాపు 50 వేల రూపాయల సబ్సిడీ ప్రభుత్వం చెల్లిస్తుందని, తక్కువ నీటితో పంట పండుతుందని, ఎకరం పంటతో లక్షల రూపాయలు సంపాదించవచ్చని, మొదటి నాలుగు సంవత్సరాల పాటు అంతర్ పంటల సాగు చేయవచ్చని, రైతులంతా ఆలోచించి లాభసాటి ఆయిల్ పామ్ వైపు దృష్టి సారించాలని అన్నారు. సీతారామ ప్రాజెక్టు క్రింద యాతాలకుంట టన్నెల్ పనులు వేగవంతం చేయడంలో మంత్రి తుమ్మల కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే దగ్గర మనకు ఉపయోగపడేలా 2 ఎగ్జిట్ లు ఏర్పాటు చేశామని అన్నారు. బుగ్గపాడులో ఫుడ్ పార్క్ నిర్మాణం పూర్తి చేశామని, త్వరలోనే అక్కడ కంపెనీల ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు సృష్టిస్తామని అన్నారు. టి.జి. ఆయిల్ ఫెడ్ ఎండి యాస్మిన్ బాషా మాట్లాడుతూ, ఉగాది పర్వదినం సందర్భంగా 4వ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందని అన్నారు. గంటకు 15 నుంచి 60 మెట్రిక్ టన్నుల గెలల క్రషింగ్ సామర్థ్యంతో 102 కోట్ల రూపాయల అంచనాతో అధునాతన ఆయిల్ పామ్ కర్మాగారం ఏర్పాటుకై ప్రణాళికలు రూపొందించామని, ఈ పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసామని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఇప్పటికే 30 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతుందని, సంవత్సరానికి 60 వేల మెట్రిక్ టన్నుల ఆయిల్ పామ్ దిగుబడి వస్తుందని, ఇది భవిష్యత్తు రోజుల్లో లక్షా 50 వేల మెట్రిక్ టన్నులకు చేరుతుందని అన్నారు. అత్యున్నత టెక్నాలజీతో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం వల్ల మంచి దిగుబడి సాధ్యం అవుతుందని అన్నారు. మన రాష్ట్రంలో ఇప్పటి వరకు 65 వేల మంది రైతులను ఒప్పించి 2 లక్షల 50 వేల ఎకరాల సాగు ఆయిల్ పామ్ క్రింద తీసుకుని వచ్చామని అన్నారు. ప్రతి రైతుకు పొలం దగ్గర నుంచే ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ కంపెనీలు పంట కొనుగోలు చేసేందుకు చట్టబద్దత కల్పించామని, 3 రోజులలో డబ్బులు రైతుల ఖాతాలలో జమ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, కల్లూరు ఆర్డీఓ ఎల్. రాజేందర్, వ్యవసాయ, మార్కెటింగ్, ఉద్యానవన శాఖల అధికారులు, తెలంగాణ, ఆంధ్రా ఆయిల్ పామ్ అధ్యక్షులు, ప్యాక్స్ డైరెక్టర్ లు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బిల్డింగ్‌పై నుండి పడి ఆశ్రమ పాఠశాల వంట మనిషి మృతి



**గుండాల, సూర్య (మేజర్ న్యూస్) –** ప్రమాదవశాత్తు మామకన్ను ఆశ్రమ పాఠశాల బిల్డింగ్ పై నుండి పడి పాఠశాలలో అవుట్సోర్సింగ్ గా పనిచేస్తున్న వంటమనిషి మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది.. వివరాలు ఇలా ఉన్నాయి కాచినపల్లి గ్రామానికి చెందిన పునెం సతీష్ (35) మామ కన్ను ఆశ్రమ పాఠశాలలో డైలీవెజ్ వంట మనిషిగా పనిచేస్తున్నాడు. రాత్రి సమయంలో తను ఉండే గది బిల్డింగ్ పైకి ఎక్కగా అక్కడి నుండి ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. వెంటనే 108 కి సమాచారం అందించగా 108 వాహనం ద్వారా గుండాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే సతీష్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా సతీష్ తరచుగా మద్యం సేవిస్తూ ఉంటాడని అంతేకాకుండా అతనికి కళ్ళు కూడా సరిగా కనపడకపోవడం వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని హాస్టల్ వార్డెన్ తెలిపారు.

## జామా మసీదులో ఖాజా గౌస్ మొహినుద్దీన్‌కు ఘన సన్మానం



**ఇల్లందుటౌన్,సూర్య (మేజర్ న్యూస్)–** ఇల్లందు పట్టణానికి చెందిన సింగరేణి కార్మికుడు ఐఎన్టీయూసీలో రాష్ట్ర బాధ్యతలు చేపడుతూ పట్టణ సింగరేణి కార్మికులకు సేవ చేస్తూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న ఖాజా గౌస్ మొయినుద్దీన్ ను పార్టీ ఢిల్లీ అధిష్టానం గుర్తించి ఏఐసీసీ అనుబంధ విభాగానికి చెందిన నేషనల్ కిసాన్ కేత్ కోఆర్డినేటర్ గా నియమించడంతో ఆదివారం పట్టణంలోని ప్రముఖ పురాతన కట్టడమైన జమా మసీద్ ముతవల్లి హబీబ్ ఆధ్వర్యంలో ఖాజా గౌస్ మొయినద్దును పలువురు మసీదు పెద్దలు శాలవలను కప్పి సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ లో మరిన్ని మంచి పదవులు అలంకరించాలని, కార్మికులకు పట్టణ ప్రజలకు సేవ చేయాలని మత పెద్దలు కోరారు. తనను కాంగ్రెస్ పార్టీ గుర్తించి నేషనల్ పదవిని ఇచ్చిన రాహుల్ గాంధీ, సోనియాగాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున కర్గే, రాష్ట్ర మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు,భట్టి విక్రమార్క, ఇల్లెందు శాసనసభ్యులు కోరం కనకయ్యలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. తన సేవలను గుర్తించిన కేంద్ర కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గతంలో పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలలో ఇటీవల జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారానికి తనను పంపడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి పట్ల, ఇల్లందు ఐఎన్టియుసి కార్మికుల సమస్యలను నివృత్తి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఎండి ఆజాం, ఎండి అక్తర్, ఇమామ్,సదత్ అలీ, ఎండి.కుర్షిద్, ఎండి.సిరాజ్ ఎండి.జావేద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కోరం కనకయ్యకు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన మండల కాంగ్రెస్ నాయకులు



**ఇల్లందు టౌన్, సూర్య (మేజర్ న్యూస్)–** తెలుగు సంవత్సర తొలి ఉగాది పండగ సందర్భంగా కోయగూడెంలోని ఎమ్మెల్యే కోరం కనకయ్య నివాస గృహంలో ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య వారి సతీమణి లక్ష్మీ దంపతులను ఆదివారం కాంగ్రెస్ ఇల్లందు మండల నాయకులు, మాదిగ జేఏసీ నాయకులు కలిసి శాలువ ను కప్పి సత్కరించి, ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఇనందు మండల పట్టణ కాంగ్రెస్ నాయకులు లాయర్ సువర్ణపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ వాకింగ్ ప్రెసిడెంట్ ఎట్టి హరికృష్ణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాదిగ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదూరి రవి, సిపిఐ పార్టీ మండల నాయకులు వడ్ల శీను,అప్పల మురళి,ముడిగ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన యువతీ యువకులు ఆర్థిక అభివృద్ధి సాధించాలి





### ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్

**బూర్గంపాడు, సూర్య(మేజర్ న్యూస్)–** ఆదివాసి గిరిజన గ్రామాలలో నివసిస్తున్న నిరుపేదలైన గిరిజన యువతి యువకులు గ్రామంలో లభ్యమయ్యే వనరులకు సంబంధించిన సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పుకొని ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి దిశగా అడుగులు వేసి తాను జీవనోపాధి పెంపొందించుకొని పదిమందికి ఉపాధి కల్పించవచ్చని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ ట్రైప్స్ కోపరేటివ్ ఫైనాన్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ట్రైకర్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ అన్నారు. ఆదివారం బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహ ఎగ్స్ ట్రేస్ ఇండస్ట్రీస్ పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గిరిజన నిరుద్యోగ యువతీ యువకుల కొరకు ప్రవేశపెడుతున్న సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పుకోవడానికి ట్రైకార్ ద్వారా 60 శాతం సబ్సిడీతో రుణాలు అందిస్తున్నామని, గిరిజన యువతి యువకులు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పై చదువులు చదువుకొని ఖాళీగా ఇంటిపట్టున ఉండకుండా నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించడానికి తెలంగాణ ముఖ్యమంత్రి రూ 1360 కోట్లను విడుదల చేసి రాజీవ్ యువ వికాస పథకాన్ని ప్రవేశపెట్టారని దాదాపు 5 లక్షల యువతి,యువకులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో వినూత్నంగా ప్రారంభించారని, ఈ పథకంలో భాగంగా రాష్ట్రంలోని గిరిజన యువతి యువకులకు ఒక లక్ష 15 వేల మందికి జూన్ రెండు నాటికి తప్పనిసరిగా అందరికీ సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలు స్థాపించుకొని ఉపాధి పొందేలా సంకల్పించామని ఆయన అన్నారు. అనంతరం పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ట్రై కార్ ద్వారా గిరిజన గ్రామాలలోని నిరుద్యోగ యువతి యువకులను గుర్తించి వారికి సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలు స్థాపించుకొని జీవనోపాధి పొందడానికి మా ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, గతంలో నిరుద్యోగుల కొరకు స్థాపించిన పరిశ్రమలు మూతపడడంతో వాటిని మరల ప్రారంభించి అవి సక్రమంగా నడిచేలా చర్యలు తీసుకుంటుందని, వచ్చే జూన్ నాటికి ఆదివాసి గిరిజన గ్రామాలలో ప్రతి పల్లెలో సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ స్కీమ్ కింద ప్రతి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృత నిశ్చయముతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఆయన అన్నారు.

### సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోండి

### బి. రాహుల్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి

ట్రైకార్ పథకం ద్వారా ఆదివాసి గిరిజన గ్రామాలలో దాదాపు 25 యూనిట్లు నడుస్తున్నాయని, కరోనా వలన మార్కెటింగ్ లేకపోవడంతో ఐదారు యూనిట్లు మూతపడిపోవడంతో తిరిగి ప్రారంభించడానికి ఐటీడీఏ ద్వారా ఆర్థికంగా సహాయం చేయడంతో తిరిగి గిరిజన యువతి యువకులు మహిళలు యూనిట్లు ప్రారంభించుకొని లాభాల బాటలో నడుస్తున్నాయని, ఎవరైనా నిరుద్యోగ గిరిజన యువతి యువకులు ముందుకు వస్తే తప్పనిసరిగా వారికి ట్రైకార్ ద్వారా రుణాలు అందించడానికి అవకాశం కల్పిస్తామని అన్నారు. ప్రస్తుతం లక్ష్మీపురం గ్రామంలో గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహ ఎగ్ ట్రే ఇండస్ట్రీస్ కేవలం ఐటిసి ద్వారా లభ్యమయ్యే రా మెటీరియల్ తో తయారు చేస్తున్నారని, సహజంగా ప్రతి గ్రామములో దొరికే వ్యర్థపదార్థాలతో ఇటువంటి యూనిట్లు గిరిజన యువతీ యువకులు నెలకొల్పుకొని స్వయం ఉపాధి కల్పించుకోవాలని అన్నారు. ఈ పరిశ్రమ స్థాపించడానికి యూనిటీ కాస్టు ఒక కోటి 50 లక్షలు కాగా సబ్సిడీ 50 లక్షలు, బెనిఫిషర్ కంట్రిబ్యూషన్ 15 లక్షలు, బ్యాంకు రుణము 80 లక్షలతో ఈ పరిశ్రమ నెలకొల్పుకొని వీరి కుటుంబాలతో పాటు 35 మందికి ఉపాధి అవకాశాలు కల్పించడం చాలా సంతోషకరమని, అలాగే మార్కెట్ సౌకర్యం కూడా కల్పించుకుంటే ప్రతి పరిశ్రమ లాభాల బాటలో నడుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టైగర్ జిఎం శంకర్రావు, ట్రైకార్ మిషన్ మేనేజర్, లక్ష్మీ ప్రసాద్, బిపిఎల్ జిఎం శ్యామ్ కిరణ్, ఎస్ ఓ భాస్కరరావు, ఏవో సున్నం రాంబాబు, డీఎస్ఓ ప్రభాకర్ రావు, మేనేజర్ ఆదినారాయణ మరియు వివిధ శాఖలకు చెందిన అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకున్న బెల్లయ్య నాయక్



**భద్రాచలం, సూర్య( మేజర్ న్యూస్)–** తెలంగాణ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కోపరేటివ్, ఫైనాన్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్, చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ బృందం కుటుంబ సభ్యులతో కలిసి భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆదివారం తెలంగాణ ట్రైకార్ మిషన్ మేనేజర్ లక్ష్మీప్రసాద్ తో కలిసి స్వామి వారి దర్శనానికి వచ్చిన బృందానికి దేవస్థానం పర్యవేక్షకుడు సాయిబాబా, అర్చక స్వాములు మేళ తాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా బలపీఠం వద్ద పూజలు నిర్వహించి, గర్భగుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష్మీ తాయారు అమ్మ వారిని, ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. అర్చక స్వాములు స్వామివారి విశిష్టతను తెలిపి పట్టు వస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ భాస్కర్, ఏవో సున్నం రాంబాబు, డీఎస్ఓ ప్రభాకర్ రావు, మేనేజర్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వైభవోపేతంగా ఉగాది వేడుకలు



**కొత్తగూడెం టౌన్, సూర్య(మేజర్ న్యూస్)–** పట్టణపరిధిలోని శ్రీ పాండురంగ భజన మందిరం లో ఆదివారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు దేవాలయ కార్యనిర్వహణాధికారి కె సులోచన తెలిపారు. ఈ క్రమంలో శ్రీ విశ్వవసు నామ సంవత్సర పురస్కరించుకొని శ్రీ స్వామి వార్లకు అభిషేకములు, సహస్రనామార్చన, పూజ కార్యక్రమాలు అతివైభవ పేతంగా నిర్వహించారు. అదేవిధంగా సాయంకాలం 5 గంటలకు పంచాంగ శ్రవణం ఆలయ అర్చకులచే నిర్వహించడం జరిగినదని తెలిపారు.

## సర్వమత సామరస్యానికి ప్రతీక రంజాన్

### బీఆర్ఎస్ జిల్లా నాయకులు సంకుబాపన అనుదీప్

**కొత్తగూడెం అర్బన్, సూర్య(మేజర్ న్యూస్) –**దకొత్తగూడెం పట్టణంలోని ఐదో వార్డ్ – ప్యూన్ బస్తి మస్జిద్ –ఎ –సలాం మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు సంకుబాపన అనుదీప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనుదీప్ మాట్లాడుతూ తెలంగాణలో మత విద్వేషాలకు తావులేకుండా హిందూ, ముస్లింలు కలిసిమెలిసి ఉంటున్నారని, తెలంగాణ రాష్ట్రం సర్వమత సామరస్యానికి ప్రతీకగా నిలిచిందన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ప్రభుత్వం అన్ని మతాల పండుగలను నిర్వహించే గొప్ప సంస్కృతిని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకొచ్చారని కొనియాడారు. కులమతాలకు అతీతంగా గ్రామాల్లో రంజాన్ వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు ఇఫ్తార్ కిట్లు అందించిన అనుదీప్ ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో హమీద్, అస్లాం, భాషిద్ ,షోయబ్, రజాక్ , మహమ్మద్ గౌస్, షేక్ అక్షరం, మహమ్మద్ అలీ, మహమ్మద్ రషీద్ ,మహమ్మద్ సర్వర్ సాబ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు

### ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించిన జిల్లా నేత వెంకటరెడ్డి,మంగీలాల్ నాయక్

**జూలూరుపాడు,సూర్య(మేజర్ న్యూస్)–** వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ కు జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లేళ్ల వెంకటరెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంగీలాల్ నాయక్ కొత్తగూడెంలోని ఎమ్మెల్యే నివాసంలో ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.వైరా నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజల మన్ననలు పొందాలని,రాజకీయంగా అంచలంచలుగా ఎదుగుతూ ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లచ్చు నాయక్, ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు ఆర్కే నాయుడు, చలమల నరసింహారావు, మెంతుల కృష్ణ, బాలాజీ, వెంకటేష్, పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



## ముస్లిం సోదరుల నమాజ్‌కు ఈద్గా సిద్ధం



**ఇల్లందు సూర్య (మేజర్ న్యూస్)–** రంజాన్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులు ప్రార్థనలు చేసుకునేందుకు బైపాస్ రోడ్ లోని ఈద్గా సిద్ధం అయింది. ఇల్లందు డి.ఎస్.పి చంద్రబాను, సర్కిల్ ఇన్స్పెక్టర్ బత్తుల సత్యనారాయణ ఈద్గా ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కూరగాయల మార్కెట్ జానీ, మాజీ వైస్ చైర్మన్ సయ్యద్ జానీ పాల్గొన్నారు.

## ఆయుర్వేదంతో సంపూర్ణ ఆరోగ్యం -ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



**ఇల్లందు టౌన్, సూర్య (మేజర్ న్యూస్)–** ఆయుర్వేదంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు ఉగాది పండుగ సందర్భంగా కరెంట్ ఆఫీస్ సెంటర్ ఖమ్మం రోడ్డులో ఏర్పాటుచేసిన సహజ ఆయుర్వేద వైద్యశాలను ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నయం కాని మొండి రోగాలు కూడా ఆయుర్వేదంతో నయమవుతాయన్నారు. ఈ ఆయుర్వేద మందులను సద్వినియోగం చేసుకొని ప్రజలు రోగాల బారిన పడకుండా కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, నియోజకవర్గ నాయకులు మాజీ వైస్ ఎంపీపీ మండల రాము, మండల ఎంపీటీసీ పూణెం సురేందర్, డి శివకుమార్, కాకాటి భార్గవ్, ప్రసన్న, ఆఫ్రిద్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పాస్టర్ ప్రవీణ్ పగడాలను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

### చంద్రుగొండ మండల పాస్టర్స్ వెల్ఫేర్స్ అసోసియేషన్ డిమాండ్

### చంద్రుగొండలో పాస్టర్లు శాంతియుత నిరసన




**చంద్రుగొండ సూర్య (మేజర్ న్యూస్)** పాస్టర్ ప్రవీణ్ పగడాల ది సాధారణ మరణం కాదని ఇది ముమ్మాటికీ హత్యేనని ఈ హత్యకు పాల్పడిన నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని చంద్రుగొండ ఫాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం చంద్రగొండ ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఇందిరా గాంధి సెంటర్ వరకు ఫాస్టర్స్ శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో క్రైస్తవులపై కొంతమంది దుండగులు అమానుషంగా దాడులు చేస్తున్నారని ఇది తెలుగు రాష్ట్రాల్లో మరింతగా పెరిగిపోయిందన్నారు. అందులో భాగంగానే ఈనెల 25వ తేదీన రాజమండ్రిలో పాస్టర్ ప్రవీణ్ పగడాల ను కొంతమంది దుండగులు హత్య చేసి దానిని యాక్సిడెంట్ రూపంలో చిత్రీకరిస్తున్నారని, ఇది ముమ్మాటికి హత్యేనన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ప్రభుత్వాలు వెంటనే స్పందించి ఇలాంటి దుండగులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మరోసారి ఇతర మతస్తులపై ఎవరు దాడులు చేయకుండా భయపడే విధంగా చర్యలు ఉండాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు పాస్టర్ కే ఏసురత్నం, ప్రధాన కార్యదర్శి ఎస్ లాజరస్, ట్రెజరర్ కె జడ్సన్, రివెండర్ ఆంట్రూస్, క్రైస్తవ మత పెద్దలు, క్రైస్తవులు, భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన వనమా రాఘవేంద్రరావు



**కొత్తగూడెం టౌన్,సూర్య (మేజర్ న్యూస్)–** కొత్తగూడెం నియోజకవర్గ ముస్లిం సోదర, సోదరీమణులకు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వనమా రాఘవేంద్రరావు ఆదివారం ఒకప్రకటనలో రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ రంజాన్ పర్వదినం నుండి నియోజకవర్గంలోని ప్రతి కుటుంబంలో అందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటన్నట్లు తెలిపారు. అధికారంలో ఉన్న...లేకున్నా .. వనమా కుటుంబం నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటుందని.. నియోజకవర్గ ప్రజల కష్టసుఖాలలో.. పాలుపంచుకుంటామని పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే కోరం కనకయ్య దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా ఉగాది పండుగ వేడుకలు





**ఇల్లందు టౌన్ సూర్య (మేజర్‌న్యూస్)–** శ్రీ విశ్వావసు నామ తొలి తెలుగు సంవత్సర ఉగాది పండగ సాంప్రదాయ వేడుకలు ఆదివారం ఇల్లందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ పార్టీ పట్టణ మండల మహిళలు విశేషంగా అత్యధికంగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖ దేవాలయం హరి హర క్షేత్ర విశ్వరూపాచారి అయ్యగారి ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే కోరం కనకయ్య దంపతులు పాల్గొన్నారు. గణపతి పూజ, దేవుని పటం పూజను నిర్వహించారు.క్యాంపు కార్యాలయ సింహద్వారం ముందు కోరం కనకయ్య,లక్ష్మి దంపతులు నిలబడగా పూజారి విశ్వరూప చారి దీప దూపాలతో, మంత్రోచ్ఛారణల మధ్య మాజీ కౌన్సిలర్ సీనియర్ పట్టణ నాయకులు మడుగు సాంబమూర్తి చేతుల మీదుగా మంచి బూడిద గుమ్మడికాయ పైన దీపాన్ని వెలిగించి పలు సార్లు దిష్టి తీసి నేలకేసి కొట్టారు. అనంతరం ఎమ్మెల్యే కోరం కనకయ్య దంపతులు క్యాంపు కార్యాలయ ఆవరణలోకి వచ్చి కూర్చున్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తెల్ల షర్టు తెల్ల లుంగీలను ధరించి తెలుగువారి ఉగాది పండగ సాంప్రదాయ ఆచార వ్యవహారాలను తెలిపారు. పలువురు పార్టీ నాయకులు కోరం కనకయ్య దంపతుల ఆశీర్వాద వచనాలను పొందారు. ఈ సందర్భంగా మహిళలు ఉగాది పండుగ సందర్భంగా చేసిన పులిహార, పూర్ణాలు,ఉగాది పచ్చడి, పానకం అందరికీ పంపిణీ చేశారు. ఏపీఎం దుర్గారావు కోరం కనకయ్య దంపతుల ఆశీర్వచనం పొందిన తర్వాత అరటి పండ్లు, సంత్రాలు, ద్రాక్ష పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, ఇల్లందు మాజీ మున్సిపల్ చైర్మన్ ఎదలపల్లి అనసూయ, ఇల్లందు మండల ప్రజా పరిషత్ వైస్ చైర్మన్ మండల రాము, కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షులు దొడ్డ డానియల్, కాంగ్రెస్ పట్టణ పార్టీ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుదర్శన్ కోరి, మాజీ కౌన్సిలర్ కమల్ కోరి, మాజీ కౌన్సిలర్ ప్రతి స్వప్న, నాయకులు కాకటి భార్గవ్, ఎంపీటీసీ పూనం సురేందర్, ఆరేం కిరణ్,పడిదల నవీన్ కుమార్, కాంట్రాక్టర్ చిట్టిబాబు, ప్రసాద్, షేక్ ఇమామ్, ఇల్లందు కాంగ్రెస్ పట్టణ కమిటీ మహిళా సంఘం అధ్యక్షురాలు గాలిపల్లి స్వరూప, ఇల్లందు పట్టణ బి బ్లాక్ అధ్యక్షురాలు గూగులోత్ కమలమ్మ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా సంఘం కార్యదర్శి గోచి కొండ శ్రీదేవి, మడుగు వెంకటలక్ష్మి,పట్టణ సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్ మడుగు సాంబమూర్తి, బొల్ల సూర్యం,చిల్లా శ్రీను, సీనియర్ పట్టణ నాయకురాళ్లు చిల్ల విజయభారతి, వరలక్ష్మి మేడం, బాలాజీ నగర్ మాజీ సర్పంచ్ పాయం స్వాతి, సుదిమల్ల మాజీ సర్పంచ్ కల్తీ పద్మ, ముకుందాపురం మాజీ సర్పంచ్ చుక్కమ్మ, మేదరి నిర్మల, కాపు సరిత, తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందు వాసి ఓరేం కిరణ్‌కు డాక్టరేట్



**ఇల్లందు, సూర్య(మేజర్‌న్యూస్)–** స్థానిక 23వ వార్డు 24 ఇంక్లైన్ ఏరియాకి చెందిన ఓరం అశోక్ కుమార్ అనసూయ దంపతుల రెండవ కుమారుడు ఓరం కిరణ్ కుమార్ ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పట్టా పొందారు. తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన హైడ్రా విభాగంలో సైంటిస్టుగా పనిచేస్తున్న ఓరం కిరణ్ కుమార్ కరీంనగర్ జిల్లా శనిగారం ప్రాజెక్టులో నీటి పారుదల, లభ్యత, ఉపయోగంపై జియోగ్రాఫి ఇన్ఫర్మేషన్ సిస్టం, రిమోట్ సెన్సింగ్ విధానాలపై పరిశోధనలు చేసినందుకు గాను ఉస్మానియా యూనివర్సిటీ ఆయనకు డాక్టరేట్ కొట్టాను ప్రధానం చేసింది. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ, జియోగ్రఫీ ఇన్ఫర్మేషన్ సిస్టం రిమోట్ సెన్సింగ్ వలన కలిగే ఉపయోగాల పైనా కరీంనగర్ జిల్లాలోని శనిగరం ప్రాజెక్టు నీటిపారుదల నిర్వహణ పై పరిశోధనలు చేసినట్లు తెలిపారు. తాను చేసిన పరిశోధనలకు ప్రొఫెసర్ గీతారెడ్డి అనంత్ సహాయ సహకారాలు, సూచనలు సలహాలు అందించారని తెలిపారు. ఈ సందర్భంగా గీతా రెడ్డి తో పాటు, ఇతర ప్రొఫెసర్లకు కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. చిన్ననాటి నుండి తన తల్లిదండ్రులు క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్పించడం మూలాన దాని స్థాయికి ఎదగగలిగినట్లు తెలిపారు.తాను పొందిన ఈ డాక్టరేట్ ను స్వర్గస్తులైన తన తల్లి అనసూయకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. తాను ఈ స్థాయికి ఎదగటానికి తల్లిదండ్రులతో పాటు, సోదరులు సంతోష్,నవీన్, చెల్లి మానస, బావ మాధవరావు, జీవిత భాగస్వామి విశాలి లా, ఇతర కుటుంబ సభ్యులు సహాయ ప్రోత్సహం మరువలేనిదాని అన్నారు. ఇది ఇలా ఉండగా కిరణ్ కు డాక్టరేట్ వచ్చిన సందర్భంగా తోటి ఉద్యోగులు, చిన్ననాటి స్నేహితులు ఏరియా పెద్దలు అభినందనలు తెలిపారు.

## జూలూరుపాడులో పర్యటించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్





### ట్రాలీ ప్రమాద పెద్దవాగు వంతెన ను పరిశీలించిన ఎమ్మెల్యే

### బేతాళ్లపాడులో పలు బాధిత కుటుంబాలకు పరామర్శ

**జూలూరుపాడు, సూర్య(మేజర్ న్యూస్) –** వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోతు రామదాసు నాయక్ జూలూరుపాడు మండలంలో విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా గత వారం రోజుల క్రితం బేతాలపాడు పెద్దవాగు వద్ద జరిగిన ట్రాలీ బోల్తా పడి ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించారు. పెద్దవాగుపై గ్రిల్స్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం బేతాళ పాడు గ్రామంలోని బానోతు రాందాస్ నాయక్ పూరి గుడిసె ప్రమాదవశాత్తు కాలిపోవడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన రాందాసు కుటుంబానికి రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఒక యూనిట్ ను కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో పక్కా గృహాన్ని మంజూరు చేస్తానని ఎమ్మెల్యే వాగ్దానం చేసారు. బేతాళ పాడు గ్రామంలో మృతి చెందిన దివంగత కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొడ్డు కృష్ణయ్య చిత్రపటానికి పూలమాలవేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జూలూరుపాడు గ్రామంలో బిజెపి పార్టీ జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు మాదినేని సతీష్ తల్లి హైమావతి ఆరోగ్య సమస్యతో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న సమాచారం తెలుసుకుని వారి నివాసానికి ఎమ్మెల్యే రాందాస్ నాయక్ వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లేళ్ల వెంకటరెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాలోత్ మంగీలాల్ నాయక్,జిల్లా కాంగ్రెస్ నాయకులు దొండపాటి శ్రీనివాస రావు (వాసు)ఎమ్మెల్యే కుమారుడు విగ్నేష్ నాయక్.మాజీ ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదన్ రావు,రోకటి సురేష్, నున్నా కృష్ణయ్య, వేల్పుల నరసింహారావు, లచ్చునాయక్, ఆర్కే నాయుడు, హరి, కొలిపాక వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ రాందాస్, మండల మహిళా అధ్యక్షురాలు గుగులోత్ ప్రియాంక, రాంబాబు, మెంతుల కృష్ణ,మిరియాల కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

# వినాయక మందిరంలో ఘనంగా ఉగాది వేడుకలు





### స్వామివారికిఅభిషేకములువిశేష పూజలు

### గోత్రనామార్చన గో పూజలు

**వైరాసూర్యమేజర్ న్యూస్:** వైరా వర సిద్ధి వినాయక మందిరంలో ఆదివారం నూతన తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు వైరా గణేష్ నగర్ లోని కొలువు తీరిన వినాయక స్వామి మూర్తికి అభిషేకములు నూతన వస్త్రాలంకరణ విశేషాలంకరణ నివేదన నీరాజన మంత్రపుష్పం నిర్వహించారు . మందిరంలో గో పూజలు నిర్వహించారు అనంతరం ఉగాది పచ్చడిని భక్తులకు అందించారు గోత్రనామార్చన తీర్థ ప్రసాదములు స్వీకరించి భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులు అయ్యారు ఉగాది రోజు న స్వామివారికి పట్టు వస్త్రాలను మందిరం సెక్రెటరీ రంగా సత్యనారాయణ వాసవి దంపతులు అందించారుఅనంతరం అర్చకులు విశ్వా వసునామ ఉగాది విశిష్టతను భక్తులకు వివరించారు. తెలుగు సంవత్సరాలలో 39వ దైన విశ్వాస నామ సంవత్సరంలోకి అడుగు పెట్టామని ఈ పేరు విశ్వ ం వసు అనే రెండు పదాల కలయిక విశ్వం వాస యతి అంటే విశ్వానికి నివాసాన్ని కలిగించినవాడు భగవంతుడని అర్థమని తెలిపారు ఈ పేరు మహావిష్ణువు కు కూడా వర్తిస్తుందని శుభకారకుడు శ్రీహరి పేరిట ఉన్న ఈ ఏడాది అందరికి సంతోషాన్ని కలిగించి పరస్పర ప్రేమానురాగాలను పెంపొందిస్తుందని విశ్వావసునామ సంవత్సరంలో అందరికీ అన్నింటి క్షేమం కలుగుతుందని తీపి చేదు కలిసిందే జీవితం అని కష్ట సుఖం తెలిసింది జీవనమని అలాంటి జీవితంలో ఆనందోత్సాహాలను వచ్చేందుకే వచ్చిన ఉగాది పర్వదినం అని తెలిపారు ప్రజలందరూ సిరిసంపదలతో ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సంతోషంగా జీవించాలని భక్తులను ఆశీర్వదించారు ఈ సంవత్సరం అన్ని రాశుల వారికి సమాన ఫలితాలు ఉన్నాయని అర్చకులు వివరించారు . ఈ అభిషేక కార్యక్రమాల్లో మందిర చైర్మన్ పుప్పాల అనంత రాములు కోశాధికారి మాదినేని లక్ష్మణరావు రంగా సత్యనారాయణ వాసవి దంపతులు మాదినేని దుర్గాప్రసాద్ సునీత దంపతులు పసుమర్తి కృష్ణ లలిత దంపతులు మిట్టపల్లి శ్రీనివాసరావు మంజుల దంపతులు రాయపూడి వెంకటేష్ రజనీ దంపతులు రంగా సింహాద్రి ఝాన్సీ దంపతులు పుప్పాల వెంకటేశ్వర్లు లావణ్య దంపతులు కొణతాలపల్లి సుజిత్ మౌనిక దంపతులు కట్ల రంగారావు పాశం శ్యామ్ నల్లమోతు లక్ష్మీనారాయణ రేచర్ల పుల్లయ్య ఏడు నూతల బుచ్చి రామారావు ఫోటోగ్రాఫర్ పమ్మి రాజు అభిషేకం పూజ కార్యక్రమంలో పాల్గొని గో పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదములు స్వీకరించారు.

## ఆంజనేయ స్వామి దేవాలయం ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆర్యవైశ్య మహిళల సౌందర్యలహరి పారాయణం





**నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలోని శ్రీ కోనేరు ఆంజనేయ స్వామి దేవాలయంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రేగూరి హనుమంతరావు అధ్యక్షతన శ్రీ విశ్వనామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా పురేహితులు పతంగి పవన్ కుమార్ శర్మ పంచాంగ శ్రవణం,ఆర్యవైశ్య మహిళల సౌందర్యలహరి పారాయణం నేలకొండపల్లి పట్టణ ఆర్యవైశ్యులు 300 మంది భక్తులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పురోహితులు మాట్లాడుతూ... ఈ సంవత్సరం రాజ్యాధిపతి సూర్యుడు అయినందున అన్ని రంగాలలో దేవుడు చక్కగా చూస్తాడని, సకాలంలో వర్షాలు కురుస్తాయని పురోహితులు తెలియజేశారు. ప్రతి ఒక్కరికి పురోహితులు పేరు బలాలను గురించి వివరించారు.భక్తుల తీర్థప్రసాదాలు కమిటీ వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రేగూరి హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి కొత్త వేణుబాబు, కోశాధికారి తెల్లాకుల అశోక్, మండల అధ్యక్షుడు దోసపాటి చంద్రశేఖర్, కార్యదర్శి ఎర్ర నాగేశ్వరరావు,కోశాధికారి మాటూరు సుబ్రహ్మణ్యం, అప్పన ధనుంజయ,మాజీ సర్పంచులు వంగవీటి నాగేశ్వరరావు రాయపూడి నవీన్,మామిడి వెంకన్న, రాయపుడి నాగేశ్వరరావు కనుమరులపూడి వెంకటేశ్వరరావు రామశాసయ్య, క్రాంతి కిరణ్,దేవరశెట్టి లక్ష్మణరావు,గెల్ల జగన్మోహన్రావు, సర్వేశ్వరరావు,కందిమల్ల హరి,కొత్త రాణి కొత్త శారద,దోసపాటి ఉషారాణి,కొత్త నవ్య తదితరులు పాల్గొన్నారు.

# పాస్టర్ ప్రవీణ్ మరణం క్రైస్తవ సమాజానికి తీరని లోటు

### శాంతియుత ర్యాలీ నిర్వహించిన మండల పాస్టర్స్ ఫెలోషిప్

### బహుముఖ ప్రజ్ఞాశాలిని కోల్పోయాం

### మండల అధ్యక్షులు కబీర్ దాస్

**జూలూరుపాడు,సూర్య(మేజర్ న్యూస్)-** పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం క్రైస్తవ సమాజానికి తీరనిలోటని జూలూరుపాడు మండల పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ సభ్యులు విచారం వ్యక్తం చేసారు.ఆదివారం మండల కేంద్రంలో పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో క్రైస్తవ బోధకుడు,భారత క్రైస్తవుల గొంతుక పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతికి సంతాపాన్ని తెలుపుతూ శాంతియుత ర్యాలీ నిర్వహించారు.మండలంలోని క్రైస్తవ బోధకులు,వివిధ సంఘాల విశ్వాసులు పాస్టర్ ప్రవీణ్ పగడాల కు నివాళు లర్పించారు.జూలూరుపాడు మండల ఫెలోషిప్ అధ్యక్షులు పాస్టర్ కబీర్ దాస్ మాట్లాడుతూ క్రైస్తవ సమాజం ఒక గొప్ప క్రైస్తవ సంఘ నాయకున్ని కోల్పోయిందని,ఆయన మరణం క్రైస్తవ లోకాన్ని కలిచి వేసిందన్నారు.ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ ప్రవీణ్ కుటుంబానికి సంతాపం తెలిపారు.ఆయన మరణం వెనుక అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, అధికారులు సమగ్ర దర్యాప్తు




జరిపి వాస్తవాలను వెలికి తీయాలని కోరారు.రాజ్యాంగంలోని మత హక్కు ద్వారా కల్పించిన స్వేచ్ఛను కాపాడవలసిన బాధ్యత కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల పై ఉందని,ప్రభుత్వాలు అన్ని మతాలను సమానంగా గౌరవించి,పరమత సహనం పాటించాలి అని విజ్ఞప్తి చేసారు.ఈ కార్యక్రమంలో ఫెలోషిప్ కమిటీ కార్యదర్శి యస్ శు భాకర్,మండల పాస్టర్స్ పి మహేష్ విక్టర్,బి బిచ్చు నాయక్,వి ఎలీషా,వి నతానియేల్ రాజ్,పి నిరీక్షన్ కుమార్, ఎబినేజర్,పాల్సన్ విశ్వాసరావు,జి ఇస్సాక్,శ్రీకాంత్, కిరణ్, పౌల్, మహేష్, సత్యవర్ధన్,జాన్ తదితర సంఘాల విశ్వాసులు పాల్గొన్నారు.

# క్షణాల్లో పోయిన ఫోను అప్పగింత



**సూర్య ప్రతినిధి ఖమ్మం :** మండల కేంద్రం రఘునాథపాలెం కు చెందిన ఎర్రబెల్లి సాయికుమార్ తన భార్యతో ఆదివారం ఖానాపురం నుండి ద్విచక్ర వాహనం మీద ఖమ్మం బస్టాండుకు వెళ్తుండగా తన భార్య ఫోను జారి పడిపోగా ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా టూ టౌన్ ఎస్ఐ వానపల్లి రమేష్ 15 నిమిషాల్లో ఫోన్ ట్రేస్ చేసి ఫిర్యాదికిఅప్పగించడం జరిగింది. భార్యా భర్త లిద్దరూ ఎస్సైకి కృతజ్ఞతలు తెలిపారు

# ఇఫ్తార్ విందులో పాల్గొన్న పెరుగు ప్రసాద్




**వైరాసూర్యమేజర్ న్యూస్ :** ఖమ్మం జిల్లా వైరా మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డ్ లో ఉన్నటువంటి మసీదులో పవిత్ర రంజాన్ ను పురస్కరించుకొని ముస్లింలు నెల రోజులపాటు ఉపవాస దీక్షలో పాల్గొని ఉంటారు ఈరోజు ఆదివారం ముస్లిం సోదరులకు ఖర్జూరపు పండు తినిపించి దీక్షను విరమింప చేశారు. తరువాత "విందు" సదుపాయం ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమంలో పెరుగు ప్రసాద్, పణితి సురేష్,పఠాన్ జానీ. మసీదు కమిటీ బాధ్యులు మైనార్టీ ముస్లిం సోదరులు తదితరులు విందులో పాల్గొన్నారు.

# ముస్లిం సోదర, సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు – మాజీ ఎంపీ నామ



**ఖమ్మం, సూర్య ప్రతినిధి మార్చి 28:** పవిత్ర రంజాన్ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు హార్దిక శు భాకాంక్షలు తెలియజేశారు. ఉపవాస దీక్ష, ప్రార్థనలతో పండుగ జరుపుకునే రంజాన్ ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం, సుఖసంతోషాలను అందించాలని ఆకాంక్షించారు. ఈ పవిత్ర మాసం త్యాగం, సహన, సమానత్వం, దయకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. ముస్లిం సోదరులు చేపట్టే రోజా, నమాజ్, జకాత్ వంటి ఆచారాలు మనుషుల మధ్య ప్రేమాభిమానాలు పెంచేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయం లో సామాజిక, ఆర్థిక, విద్యా, మతపరమైన అభివృద్ధిలో ముస్లిం ప్రజలకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, తెలంగాణను మైనారిటీలకు ఆదర్శ రాష్ట్రముగా నిలిపిందన్నారు. తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ స్థాపన ద్వారా ముస్లిం విద్యార్థులకు ఉచిత విద్య, వసతి, భోజనం కల్పించటంతో పాటు మైనారిటీ విద్యార్థులకు విదేశీ విద్యా స్కాలర్షిప్ ద్వారా ఉన్నత విద్యకు సహాయపడటం జరిగిందన్నారు. షాదీ ముబారక్ పథకం ద్వారా పేద ముస్లిం యువతికి ప్రత్యేక ఆర్థిక సహాయం అందజేసిందన్నారు. నాడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఓబీసీ ముస్లిం మైనారిటీ కమ్యూనిటీకి 4 శాతం నుంచి 12 శాతానికి రిజర్వేషన్ పెంచుతూ రాష్ట్ర అసెంబ్లీలో చట్టాన్ని ఆమోదించిందని ఈ సంధర్బంగా నామ గుర్తు చేసారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముస్లిం సోదర, సోదరీమణులకు అభ్యున్నతి కోసం తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని నామ పేర్కొన్నారు. రంజాన్ వేడుకలు సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, నూతన ఆశలు నింపాలని, అందరికీ సంపద, ఆరోగ్యం, శుభఫలితాలను అందించాలని ఆకాంక్షిస్తూ, మరోసారి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు

# దేవాలయాలలో ఉగాది వేడుకలు



**నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్ :** ఉగాది పర్వదినము సందర్భంగా మండల కేంద్రంలోని పలు దేవాలయంలో సందడి నెలకొంది.పండగను పురస్కరించుకుని ఆదివారం తెల్లవారుజాము నుండి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.రామదాసు ధ్యాన మందిరంలో పూజారి సామిత్రి రమేష్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.భక్తులు ఉగాది పచ్చడిని అందించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు వంగవీటి నాగేశ్వరరావు,మామిడి వెంకన్న,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజని, కడియాల నరేష్ వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. శ్రీ వెంకటేశ్వర స్వామి,అంజనేయ స్వామి దేవాలయం,శ్రీ ఉత్తరేస్వర స్వామి,శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయంలో భక్తులతో ఉగాది సందడి కనిపించింది.

# బీరప్ప ఆలయంలో కురుమలు ప్రత్యేక పూజలు



**కొణిజర్ల సూర్య (మేజర్ న్యూస్)** కురుమల కులదైవం శ్రీ బీరప్ప స్వామి కామరాతి అమ్మవారికి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు ఆదివార%శీ% నిర్వహించారు. మండలంలోని చిన్నగోపతి, తనికెళ్ళ, తుమ్మలపల్లి కొణిజర్ల గ్రామాలలో వున్న కురుమలు బీరప్ప స్వామికి "విశ్వాస వసు" నామ నూతన సంవత్సరం ఉగాది పండుగ సందర్భంగా ప్రతి ఏటా కుల పెద్దల రాజు, పతాని ఆద్వర్యంలో పూజాకార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో గ్రామాలలో వున్న కురుమలు కుల బంధువుల కుల సాంప్రదాయ ప్రకారం అందరి సహకారంతో నిర్వహిస్తారు. గ్రామ పెద్దలు శత కోటి లింగమంతులను వేడుకొని ఒగ్గు కళాకారుని చేత పసుపు బండారి లతో ముగ్గు పట్నం వేసి మెళ్ళ తాళ్ళుల మధ్య లింగ మూర్తులను సుద్ది చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. భక్తి శ్రద్ధలతో ఆస్వామివారికి మహిళ భక్తులు ద్వారా నవేద్యాన్ని తయారు చేసి బోనాల రూపంలో సమర్పిస్తారు. జాతరగా తరలి వచ్చిన కుల బంధువుల నమ్మకంతో ఆచార ప్రకారం జంతువులను బలిదానం చేసి మొక్కులు చెల్లిస్తారు. అనంతరం స్వామివారికి సమర్పించిన నవేద్యన్ని పలహారంగా స్వీకరిస్తారు. రాజు, పతానిల చిన్నగోపతి అల్లూరిభద్రయ్య, సవళ్ల లాలయ్య తనికెళ్ళ మేకల మల్లయ్య, వేంకటేశ్వర్లు, గూదే. వీరభద్రమ్, గూదేవెంకన్న, జోగు. అర్జున్, బండారు. సాంబయ్య, చింతలఆదిరెడ్డి, గూదే చంద్రయ్య స్వామివారికి పసుపు బండారి నీ సమర్పించారు.

# అనాధలకు అండగా పల్లా కిరణ్



**ఖమ్మం సూర్య (మేజర్ న్యూస్) :** ప్రముఖ సమాజ సేవకుడు పల్లా కిరణ్ తల్లి సంవత్సరికం (ప్రథమ వర్ధంతి) సందర్భంగా వారి తల్లి జ్ఞాపకార్థం సుమారు 150 మంది బాలబాలికలకు పల్లా కిరణ్ కుటుంబ సభ్యులతో కలిసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు పల్లా కిరణ్ ఏర్పాటుచేసిన విందులో రకరకాల వంటకాలు ఆస్వాదించి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# ఎన్ఎస్పి కాలువలో మృతదేహం లభ్యం

### మృతుడు ప్రకాశం జిల్లా వాసిగా గుర్తింపు



**పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్ :** పెనుబల్లి మండలం పాత కారాయి గూడెం ఎన్ఎస్పి కాలువ లో ఒక వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి విఎం బంజర పోలీసులకు సమాచారం అందించారు. గుర్తుతెలియని మృతదేహంగా విచారణ చేపట్టిన పోలీసులు మృతుడు లారీ డ్రైవర్ గా గుర్తించారు. విఎం బంజర్ ఎన్ఎస్పి కలువ వద్ద లారీని ఆపి స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. లారీ పైనున్న ఫోన్ నెంబర్ల ఆధారంగా మృతుడు సంబంధికులకు సమాచారం అందించగా ప్రకాశం జిల్లా మేదరమెట్ల కు చెందిన చిమట వెంకట రామయ్య గా గుర్తించారు. విఎం బంజర్ పోలీసులు మృతదేహాన్ని పెనుబల్లి ప్రభుత్వ తరలించి విచారణ చేపట్టారు.

# పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ




**కామేపల్లి సూర్య మేజర్ న్యూస్ :** కామేపల్లి మండల పాస్టర్స్ ఆధ్వర్యంలో జరిగిన పాస్టర్ ప్రవీణ్ పగడాల శాంతియుత ర్యాలీ లింగాల క్రాస్ రోడ్ లో నిర్వహించడం జరిగింది దీనిలో అనేకమంది పాస్టర్లు మరియు విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు ఈ విధంగా వారు ప్రవీణ్ పగడాల కేసుని పూర్తి వివరాలతో ప్రభుత్వం సేకరించాలని ఇది హత్య ఆక్సిడెంట్ అని ఒక నిర్ధారణ ఏపీ ప్రభుత్వం నిర్వహించాలని సమగ్ర సర్వే జరిపించి అవసరమైతే సిబిఐ విచారణ జరిపించిన దీని మీద ఒక క్లారిటీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించడం జరిగింది . ఇంత మంచి వ్యక్తిని కోల్పోవడం క్రైస్తవులుగా ఎంతో మంది హృదయాల్లో బాధ నెలకుందని వారు బ్లాక్ రూబెన్స్ ని ధరించుకొని నిరసన తెలియపరిచారు దీనిలో పాల్గొన్నారు. ఎస్ అబ్రహాము పండితాపురం, విజయ బాబు కామేపల్లి ఎలీషా అబ్రహం శ్యామసుందర్ సుధాకర్ త్యాగరాజు మండలంలోని తదితర పాస్టర్లు పాల్గొన్నారు

# సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలు

### పండుగ సందర్భంగా పలువురు మహిళలకు చీరలు పంపిణీ...



**ఖమ్మం, సూర్య ప్రతినిధి :** సిపిఎం పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఉగాది పండుగ సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఉగాది పచ్చడి తయారు చేసి పార్టీ కార్యకర్తలకు అందజేశారు. బివికె ట్రస్ట్ మేనేజర్ వై. శ్రీనివాసరావు సహకారంతో పండుగ సందర్భంగా పలువురు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిపిఎం పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ విశ్వావసు నామ తెలుగు వారి ఉగాది పండుగ ప్రజల్లో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. పండుగ ప్రతి కుటుంబం ఆనందంగా జరుపుకోవడానికి ఆర్థికంగా వెసులుబాటు వుండే విధంగా ప్రభుత్వ విధానాలు ఉండాల్సిన అవసరం ఉంది అని పేర్కొన్నారు. కులాలు, మతాలు అతీతంగా ఈ పండుగ జరుగుతుంది అని, ఇప్పుడు పండుగలను కూడా బీజేపీ ప్రభుత్వం రాజకీయం చేస్తుంది అని ఆందోళన వ్యక్తం చేశారు. రైతాంగం ఆనందం వుండే విధంగా ప్రభుత్వ విధానాలు వుంటే రైతు సోదరులు ప్రతి పండుగను ప్రశాంతంగా జరుపుకుంటారు అని తెలిపారు. దేశ ప్రజలు అంతా ఆనందంగా జీవించటం అనేది ఈ రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల కూడా ప్రజల జీవితాల్లో ఆనందం నింపే లాగా ఆ విధానాలు రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, నాయకులు మాదినేని రమేష్, ఎమ్ సుబ్బారావు, బండారు రమేష్, పి ఝాన్సీ, ఎండి బషీర్, దొంగల తిరుపతిరావు, ఎస్.కె మీరా సాహెబ్, ఎస్ నవీన్ రెడ్డి, భుక్యా శ్రీనివాసురావు, బోడపట్ల సుదర్శన్, ఎస్.కె నాగులు మీరా, ఉపేంద్రర్, వజేనేపల్లి శ్రీనువాసురావు, టి యల్ లక్ష్మీనర్సయ్య, బండారు యాకయ్య, ఎస్.కె బేగం , సి.భారవి, నర్రా రమేష్, కె శ్రీనువాసురావు, విప్లవ కుమార్, కళ్యాణం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# ఉగాది రోజున విషాదం





### ఆగివున్న ట్యాంకర్ ని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

### ఒకరు మృతి, ముగ్గురుకి తీవ్ర గాయాలు

**పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్ :** తన డ్యూటీ ముగించుకొని ఉగాది పండుగ సందర్భంగా త్వరగా ఇంటికి చేరుకోవాలని తన కుటుంబ సభ్యులతో కలిసి ఉగాది పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఉత్సాహంగా ఇంటికి బయలుదేరిన బస్ కండక్టర్ ని విధి పక్రీకరించి మృత్యువు కభళించింది. ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్ కండక్టర్ గా విధులు నిర్వహిస్తున్న వన్నపూరపు సీతారాం ప్రసాద్ (45) మృత్యువాత చెందాడు. వివరాలకు వెళితే..సత్తుపల్లి డిపోలో కండక్టర్ గా విధులు నిర్వహిస్తున్న కల్లూరు చెందిన వన్నపూరపు సీతారాం ప్రసాద్ తన డ్యూటీ ముగించుకున్నాడు. డ్యూటీ దిగి ఆదివారం తెల్లవారుజాము సమయంలో స్వగ్రామం కల్లూరు కి వెళ్లాలని హైదరాబాద్ బస్సు ఎక్కాడు. అంతలో విశాఖపట్నం నుండి ఖమ్మం వెళ్తున్న ఖమ్మం డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు సత్తుపల్లి బస్టాండ్ కి చేరుకుంది. సూపర్ లగ్జరీ బస్సులో త్వరగా ఇంటికి చేరుకోవచ్చుని ఎక్కిన బస్సు దిగి సూపర్ లగ్జరీ బస్సు ఎక్కాడు. బస్సు బయలుదేరి కిష్టారం దాటి పెనుబల్లి మండలం కొత్త లంకపల్లి శివారుకి చేరుకోగానే జాతీయ రహదారిపై పక్కన నిలిపి ఉన్న ఆయిల్ ట్యాంకర్ వెనక భాగంలో వేగంగా ఢీ కొట్టడంతో బస్సు ఎడమవైపు భాగం పూర్తిగా ధ్వంసమయ్యింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న కండక్టర్ సీతారాం ప్రసాద్ కి, మరో ఇద్దరు పురుషులు, ఒక మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పెనుబల్లి 108 సిబ్బంది టెక్నీషియన్ రామకృష్ణ, పైలెట్ రాధాకృష్ణ కొద్ది నిమిషాల్లోనే ఘటనస్థలికి తీవ్రంగా గాయపడిన సీతారాం ప్రసాద్ కి 108 సిబ్బంది వైద్య సహాయక చర్యలు అందించి పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన కండక్టర్ సీతారాం ప్రసాద్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తూ గాయపడిన ఖమ్మం నగరానికి చెందిన ఉదయ్ తీవ్ర గాయాలు అవగా మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. మరో పురుషుడు, మహిళను ఘటనా స్థలం నుండి సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు, కుమారుడు బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతుండగా కుమార్తె పదో తరగతి పరీక్షల రాస్తుంది. ఉగాది పండుగ రోజు సంతోషంగా గడపాలనుకున్న ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుపుకున్నాయి. ప్రమాద ఘటనపై వియ్యం బంజర పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి విచారణ చేపట్టారు. ఆగి ఉన్న ట్యాంకర్ లారీ కనిపించకపోవడంతో ప్రమాదం జరిగినట్లు ప్రమాదానికి గురైన బస్సు డ్రైవర్ పి. అప్పారావు తెలిపాడు.





# ప్రజలను ఎంత కాలం మభ్యపెడతారు – శీలం




**పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్. :** చలమాల సూర్యనారాయణ భవనంలో కండె సత్యం అధ్యక్షతన సిపిఎం పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో పెట్టిన 6 గ్యారంటీలు– నీటి మూటలేనా..? ప్రజలను ఎంతకాలం మభ్యపెడతారని శీలం సూటిగా ప్రశ్నించారు. రాబోయే కాలంలో ప్రభుత్వ హామీలు అమలు కోసం పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ముగ్గురు మంత్రులు ఉండి జిల్లా సాగునీటి ప్రాజెక్టులు ఇందిరమ్మ ఇళ్ల కోసం అధిక నిధులు సాధించడంలో వైఫల్యం చెందారని విమర్శించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు పాల్గొని మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలతో పాటు, వ్యవసాయ కూలీలకు మహిళలకు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతిని ఇస్తామని విద్యా వైద్యానికి పెద్దపీట వేస్తామని, అనేక ప్రగల్భాలు పలికిన వారు నేటి వరకు వాటి జోలికి పోవడం లేదని ఆయన విమర్శించారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి గాయం తిరపతి రావు, మండల కమిటీ సభ్యులు మిట్టపల్లి నాగమణి, చెమట విశ్వనాథం, నల్లమల అరుణ్ ప్రతాప్, చలమల నరసింహారావు, తడికమళ్ళ చిరంజీవి, గుడిమెట్ల బాబు, చిలక రామ చంద్రుడు, కలకోట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# క్రీస్తు శ్రమలను స్మరిస్తూ పాదయాత్ర

## ఫాథర్ కృపా తమనంపల్లి ఆధ్వర్యంలో



**సత్తుపల్లి మేజర్ సూర్య న్యూస్ :** సత్తుపల్లి పట్టణం లోని కార్మెల్ మాత చర్చ్ ( %=జవీ% చర్చ్ ) సంఘస్తులు సత్తుపల్లి నుండి ఆంధ్రా సరిహద్దు ప్రాంతం పశ్చిమ గోదావరి జిల్లా అల్లిపల్లి మరియ్మతల్లి దేవాలయము వరకు పెద్దఎత్తున పాదయాత్ర నిర్వహించారు...క్రైస్తవులు పరిశుద్ధ శుక్రవారం ( గుడ్ ఫ్రైడే ) కు 40 రోజులు ముందు నుండి ఉపవాస దినాలు పాటిస్తారు.అందు లో భాగంగా యేసు క్రీస్తు సర్వ మానవాళి పాపా పరిహారమునకై తననూ తాను బలిగా అర్పించుకొనుచు ఆయన అనుభవించిన శ్రమలను ద్యానిస్తూ..సత్తుపల్లి పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ఈయొక్క పాదయాత్రలో పాల్గొన్నారు..ఉదయం 6 గంటలకు ప్రారంభమైన ఈ యాత్రలో క్రైస్తవ గీతాలను ఆలపిస్తూ..భక్తి శ్రద్ధలతో అల్లి పల్లి మరియ్మతల్లి కొండకు చేరుకొన్నారు.ఈ కార్యక్రమంలో సత్తుపల్లి విచారణ గురువులు ఫాథర్ కృపా తమనంపల్లి , ఫాథర్ సతీష్ , సహాయక గురువులు ఫాథర్ జ్వాన్నెస్ , సిటిసి సిస్టర్స్ , సంఘ పెద్దలు బి.వి , ఆనంద్ , ప్రకాష్ , సురేష్ , కృష్ణయ్య , శ్రీ రాం , రామకృష్ణారెడ్డి , డేవిడ్ , తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



**పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్ :** పెనుబల్లి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. టేకులపల్లి గ్రామానికి చెందిన దండే బక్కయ్య టేకులపల్లి వద్ద గల పవర్ ప్లాంట్ లో వాచ్మెన్ గా పనిచేస్తున్నాడు. టేకులపల్లి నుండి పవర్ ప్లాంట్ కి టీవీఎస్ ఎక్సెల్ పై వెళుతుండగా ఐ సర్ వాహనాన్ని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి పెనుబల్లి ప్రభుత్వాసుపత్రి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# ఉగాది సందర్భంగా శ్రీ భక్తాంజనేయ స్వామి వారి దేవాలయంలో ప్రత్యేక పూజలు





**ఖమ్మం :** ఉగాది పర్వదినాన ప్రభాత్ టాకీస్ రోడ్డు రామాలయం ఎదురుగా గల శ్రీ భక్తాంజనేయ స్వామి వారి దేవాలయంలో స్వామివారికి పంచామృతాభిషేకము , సహస్ర నాగవల్లి దళార్చన , విశేష పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఈ విశేష పూజలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తాంజనేయ స్వామి వారిని సేవించి తీర్థప్రసాదాన్ని తీసుకొని స్వామివారి అనుగ్రహాన్ని పొందారని దేవాలయ ప్రధాన అర్చకులు శ్రీ గట్టు హరీష్ శర్మ తెలిపారు . ఆయురారోగ్యాలతో , సిరి సంపదలతో , ఆనందోత్సవంగా ఈ సంవత్సరం అంతా కొత్త కాంతులతో విరజిల్లాలని ఆకాంక్షిస్తూ భక్త యావత్ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు . విశ్వావసు' నామ సంవత్సరం అనగా ఇది విశ్వంవసు అనే 2 పదాల కలయిక . 'విశ్వం వాసయతి' అంటే విశ్వానికి నివాసాన్ని కలిగించినవాడు భగవంతుడు అని అర్థం . ఈ పేరు మహావిష్ణువుకూ వర్తిస్తుందని , శుభకారకుడైన శ్రీహరి పేరిట ఉన్న ఈ ఏడాది అందరిలో సంతోషాన్ని , ప్రేవవానంరాగాలనం పెంపొందిస్తుందని పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో భక్తులు వసంత కుమార్ పంతంగి అశోక్ , దేవ దత్తు , వంశీకృష్ణ , అనిల్ కుమార్ , వాత్సల్య హాస్పిటల్ డాక్టర్ రాజ్ కుమార్ లు పాల్గొన్నారు .

# యువత స్వయం ఉపాధితో ఆర్థిక అభివృద్ధి సాధించాలి





కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు నెల్లూరి భద్రయ్య

**నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్ :** యువత స్వయం ఉపాధితో ఆర్థిక అభివృద్ధి సాధించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు నెల్లూరి భద్రయ్య సూచించారు. మండల కేంద్రం లోని కొల్లి గాంధీ కాంప్లెక్స్ లో రావెళ్ల కృష్ణారావు క్యాంపు కార్యాలయం ను ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...యువత ప్రస్తుతం ఉన్న సాంకేతి కతను ఉపయోగించుకుని ఆర్థిక స్వలంబన సాధించాలని సూచించారు. ప్రభుత్వం యువత కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.స్వయం ఉపాధితో పాటు సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పాలేరు డివిజన్ నాయకులు రావెళ్ళ కృష్ణారావు,నాచేపల్లి సొసైటీ చైర్మన్ తన్నీరు సత్యనారాయణ, అనాసాగరం మాజీ సర్పంచ్ చిలకబత్తిని వీరబాబు,రియల్ టర్ల సంఘం జిల్లా నాయకులు గుండా బ్రహ్మం,జోగుర్తి శ్రీనివాసరావు,కడియాల నరేష్ చిట్టం చెట్టి వెంకటేష్, షేక్ కాజా మియా,కె అహ్మద్,కుర్రి నాగరాజు, వీరబాబు,జర్నలిస్టుల సంఘం నాయకులు హనుమంతరావు, పెంటమళ్ళ కోటయ్య,గంజికుంట్ల వెంకన్న,మల్లెబోయిన ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# 46వ డివిజన్లో రంజాన్ తోఫా పంపిణీ చేసిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్







**ఖమ్మం ,సూర్య బ్యూరో :** స్థానిక కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ లు ప్రతి ఏటా డివిజన్ పరిధిలోని ముస్లిం కుటుంబాలకు రంజాన్ పండుగ సందర్భంగా తోఫా పంపిణీ చేస్తారు. అందులో భాగంగా 46వ డివిజన్ ముస్లిం కుటుంబాలకు కార్పొరేటర్ తయారు చేయించిన రంజాన్ తోఫాను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణలు ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేయడం సంతోషదాయకమని తెలిపారు. అందరూ సోదర భావంతో మెలిగి పరోపకారం చేయాలని సూచించారు. పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన కొనసాగిస్తుందని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని వారు తెలిపారు. రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ రంజాన్ పండుగ సందర్భంగా తోఫా పంపిణీ చేసిన కార్పోరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ లను అభినందించారు. సమాజంలో అన్ని మతాలు సమానంగా అందరూ అన్ని పండుగలలో భాగస్వాములు కావడమే మన దేశ విశిష్టత అని తెలిపారు. కార్పోరేటర్ కన్నం వైష్ణవి మాట్లాడుతూ ముస్లిం కుటుంబాలకు మాకు తోచిన సాయం అందిద్దామని సదుద్దేశంతో ఈ తోఫా పంపిణీ చేస్తున్నామని, ప్రజలందరూ సంతోషంగా ఉండేలా అల్లా దీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షులు హుస్సేన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ ఆశ్రిఫ్, మాజీ కౌన్సిలర్ సింగం అంజయ్య, నాయకులు కాటం కొమరయ్య, దేవర వెంకన్న, శనిగరం ఉప్పలయ్య, బాల్దే నాగేశ్వరరావు, కాటం యాదయ్య, అచ్చిని వెంకటేశ్వర్లు, గోనెల రవిశంకర్, చంద్రమ్మ, ఉపేంద్రమ్మ, గోనెల సునీత, చల్లా రమేష్, గోనెల రవిశంకర్, మీరా సాహెబ్, మీర్జా అజీజుల్లా బేగ్, మస్తాన్, కన్నం రమేష్,కేసోజు వీరాచారి, బుంగ శ్రీనివాస్, ఎరుకనబోయిన వెంకటేశ్వర్లు, షేక్ జానీమియా, పగిళ్ళ బుచ్చిబాబు, వేముల విజయ్, నజీర్, బొల్లక్క శ్రీను కెమిడీ యాదగిరి , గర్షకోటి కిషన్, మోటె జగదీష్, షేక్ మోయిన్, సెల్వం జ్ఞానేశ్వర్, భైరోజు సంతోష్, కర్రె వినోద్, కడగంచి అశోక్, సోమన బోయిన కుమార్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# వేద పాఠశాలలో పంచాంగ శ్రవణం



**వైరాసూర్యమేజర్ న్యూస్ :** వైరాలోని శ్రీ భగవాన్ సత్యసాయి వేద పాఠశాల నందు విశ్వా వసు నామ సంవత్సరం పంచాంగ శ్రవణాన్ని శ్రీ వేద పండితులైన దుబ్బాక కుమార్ శర్మ భక్తులందరికీ ఆయా రాశుల ఫలితాలను వివరించారు అనంతరం నూతన తెలుగు సంవత్సరాది ఉగాది విశిష్టతను రాశుల గ్రహస్థితులను పండితులు వివరించారు చైత్ర శుద్ధ పాడ్యమినాడు వచ్చే ఈ పర్వదినానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని ఈ నూతన సంవత్సర రాశి ఫలాలు గ్రహస్థితులు ఎలా ఉన్నాయో తెలుసుకొని గృహ శాంతులు లాంటివి జరిపించుకొని సుఖంగా ఉండేందుకు పంచాంగ శ్రవణం చేస్తారని ఆచార్యులు తెలిపారు ఉగాది పచ్చడి ప్రాముఖ్యతను వివరించారు ఉగాది రోజు ముఖ్యమైన వంటగా ఉగాది పచ్చడి షడ్రుచుల సమ్మేళనంగా చేసి ఈ పచ్చడి జీవితంలో జరిగే వివిధ అనుభవాలను సూచిస్తుందని జీవితంలో అన్ని భావాలను చెప్పే భావం ఇందులో ఇమిడి ఉందని పచ్చడి ఒక్కొక్క పదార్థం ఒక్కొక్క భావానికి అనుభవానికి ప్రతికని బెల్లం తీపి ఆనందానికి ప్రతికని ఉప్పు జీవితంలో ఉత్సాహం రుచికి సంకేతం అని వేప పువ్వు చేదు బాధ కలిగించే అనుభవాలు చింతపండు పులుపు నేర్పుగా వివరించవలసిన పరిస్థితులను పచ్చి మామిడికాయ ముక్కలు వగరు కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు కారం సహనం కోల్పోయేటట్లు చేసే పరిస్థితులను సూచిస్తుందని అన్నారు ఈ విశ్వా వసు నామ సంవత్సరంలో అందరికీ అన్నింటి క్షేమం కలుగుతుందని తీపి చేదు కలిసిందే జీవితమని అలాంటి జీవితంలో ఆనందోత్సవాలు వచ్చేందుకే ఉగాది పర్వదినం అని తెలిపారు ప్రజలందరూ వ్యవసాయదారులు సేవా తత్పరులు సిరిసంపదలతో ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని భక్తులకు వివరించారు అనంతరం శ్రీ వేద పండితులైన దుబ్బాక కుమార శర్మ దంపతులను ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ కాపా మురలీకృష్ణ ఘనంగా సన్మానించారు. నూతన తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదిన సందర్భంగా సేవా తత్పరుడు సేవా మూర్తి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురలీకృష్ణ ను వేద పాఠశాల పండితులు తదితరులు ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మీల్స్ ఆన్ వీల్స్ కోఆర్డినేటర్ చింతోజు నాగేశ్వరరావు సీతా దంపతులు వేద పాఠశాల సభ్యురాలు కన్యధారి హనుమాయమ్మ లయన్స్ సభ్యులు చెరుకూరు శ్రీనివాసరావు భక్తులు వేద పాఠశాల పిల్లలు పాల్గొన్నారు



# ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి పొంగులేటి



**ఖమ్మం, సూర్య(మేజర్ న్యూస్)-** రంజాన్ పండుగను సోమవారం జరుపుకోనున్న సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్రంలోని ముస్లింలందరికీ తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. నెల రోజులు ఎంతో నిష్ఠతో ఉపవాసాలు ఉండి.. ఆకలిదప్పుల విలువ తెలుసుకొని పవిత్రంగా జరుపుకునే ఈద్ ఇదని పేర్కొన్నారు. సహనం, త్యాగం, జాలి, దయ, సేవాగుణాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలనే దృఢ సంకల్పంతో..పిల్లలు, యువతకు దిశా నిర్దేశం చేసిన మాసం ఇదని తెలిపారు. మహమ్మద్ ప్రవక్త (స) ఆదేశానుసారం.. అనాది నుంచి నేటి వరకు ఫిత్రా పేరిట ఆహారం, వస్త్రాలు, నగదు రూపంలో పేదలకు సాయం చేస్తూ వస్తోన్న సంప్రదాయం ఎంతో గొప్పదని మంత్రి పొంగులేటి అభివర్ణించారు. ఈద్గాలు, మసీదులలో ప్రత్యేక ప్రార్థనల నడుమ రంజాన్ పండుగను సంబురంగా జరుపుకోవాలని, ఈద్ ముబారక్ ఆత్మీయ శుభాకాంక్షలతో ఆనందం వెల్లివిరియాలని మంత్రి పొంగులేటి ఆకాంక్షించారు.

# ముస్లింలందరికీ.. రంజాన్ పండుగ శుభాకాంక్షలు

### ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి



**ఖమ్మం సూర్య బ్యూరో :** ఈ పవిత్ర రంజాన్ మాసంలో.. నెల రోజులపాటు రోజా ( ఉపవాసా)లు ఆచరించి.. (చాంద్) నెలవంక కనిపించడంతో.. రంజాన్ పండుగను జరుపుకోబోతున్న సందర్భాన.. శుభాకాంక్షలు. ఆ.. అల్లాహ్ కృపతో అందరూ బాగుండాలి. అంతా మంచి జరగాలి.. అని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నా.

# అపార్ట్మెంట్ ప్లాట్‌లో అగ్ని ప్రమాదం

### లక్షల్లో ఆస్తి నష్టం



**ఖమ్మం, సూర్య బ్యూరో మార్చి 30 :** ఖమ్మం నగరం లోని బుర్హాన్ పురం లోని పిన్ని అపార్ట్మెంట్ లో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించడం తో లక్షలాది రూపాయల ఆస్తి నష్టం జరిగింది. అపార్ట్మెంట్ లోని మూడో ఫ్లోర్ లో ఉంటున్న సత్తిరెడ్డి ఇంట్లో ఈ ప్రమాదం జరిగింది. ఉగాది సందర్భంగా పూజలు చేసుకుని, దేవుని గదిలో విద్యుత్ బల్బ్ స్విచ్ ఆపకుండా బంధువుల ఇంటికి వెళ్లారు. దీంతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి గదిలో మంటలు లేచి గదంతా కాలిపోయింది. మంటలు వల్ల పక్కనే ఉన్న ప్లాట్ కూడా పాక్షి కంగా దెబ్బతిన్నది. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున పొగ వ్యాపించడం తో అన్ని ప్లాట్ల లో ఉన్న వారంతా మెట్ల మార్గంలో కిందకు రావడం తో అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల ఫిర్యాదు తో ఫైర్ ఇంజన్, రెస్క్యు ఆపరేషన్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకుని వచ్చారు. ప్రమాదం సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎవరికీ ఏమి కాలేదు.



# వైభవముగా శ్రీదేవి వసంత నవరాత్రోత్సవములు ప్రారంభం







**పాల్వంచ రూరల్, సూర్య(మేజర్ న్యూస్)-** మండలపరిధిలోని కేశవాపురం జగన్నాథపురం గ్రామంలో వెలసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానము (పెద్దమ్మగుడి)లో శ్రీ అమ్మవారి "వసంత నవరాత్రోత్సవములు" కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ఆదివారం ఉదయం ప్రారంభించారు. ముందుగా దేవస్థాన సాంప్రదాయం ప్రకారం మంగళవాయిద్యములతో, వేద మంత్రాలతో దేవస్థాన అర్చకులు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్. రజనీకుమారి పూర్ణకుంభంతో స్వాగతం పలికిన తదువరి వారి కుటుంబసభ్యులతో పాటు దేవాలయం చుట్టూ ప్రదక్షణ చేసిన విదప దేవాలయంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుచే కలశస్థాపన పూజలు నిర్వహించబడినవి. ఆ తర్వాత గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాసన, ఋత్వికరణ, దీక్షా వస్త్రధారణ, అఖండదీపారాధన, మంటపారాధనలు, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు, హెూమములు అర్చకులచే నిర్వహించబడినవి. అనంతరం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ఋత్వికులకు, అర్చకులకు దీక్షావస్త్రాలు అందజేశారు. శాసనసభ్యులు వెంట రాష్ట్ర మార్కెఫేడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, ఎస్ కే . సాబీర్ పాషా ,ముత్యాల విశ్వనాథం, తదితర నాయకులున్నారు.అనంతరం మధ్యాహ్నం నుండి అమ్మవారికి లక్ష కునుమాల (మల్లెపూల)తో "లక్షకునుమార్చన" వైభవంగా నిర్వహించబడినది. ఉగాది పర్వదినం సందర్భంగా దేవస్థాన ఆవరణలో గల వేదికపై సాయంత్రం "పంచాంగశ్రవణం", రాత్రి 7.00 గం౹౹లకు నీరాజన మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం" నిర్వహించబడినది. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు అధికసంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం అవసర ఏర్పాట్లు చేయనైనది.

### పెద్దమ్మతల్లిని దర్శించుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు జడ్జి కె. సాయిశ్రీ



శ్రీ కనకదుర్గ దేవస్థానము (పెద్దమ్మగుడి)కి ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు జడ్జి కె. సాయిశ్రీ దంపతులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు చేసారు. ముందుగా "దేవస్థాన కార్యనిర్వహణాధికారి, అర్చకులు దేవస్థాన సాంప్రదాయబద్ధంగా ఆహ్వానించిన అనంతరం పూజలు నిర్వహించారు. పూజల అనంతరం వారికి దేవస్థాన అర్చకులు ఆశీర్వచనంతో పాటు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదంను అందజేశారు.

# మీ అందరికీ జీరో బిల్లులు వస్తున్నాయా.. డిప్యూటీ సీఎం.. భట్టి

### రైతు భరోసా డబ్బులు వచ్చాయా

### వంట గ్యాస్ సబ్సిడీ డబ్బులు పడుతున్నాయా

### ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుతెన్నులు గురించి

### ఉగాది పండుగ నాడు గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

### ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ది పొందుతున్నామని హర్షం వ్యక్తం చేసిన కాచవరం గ్రామస్తులు...









**ఎర్రుపాలెం, సూర్య మేజర్ న్యూస్:-** మీ అందరి ఇండ్లుకు కరెంట్ బిల్లు జీరో బిల్లులు వస్తున్నాయా...? పెద్దయ్య నీకు రైతు భరోసా డబ్బులు పడ్డాయా..? అమ్మ మీకు వంట గ్యాస్ సబ్సిడీ డబ్బులు వస్తున్నాయా? అంటూ ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్న తీరుతెన్నుల గురించి" రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గం ఎర్రుపాలెం మండలం కాచవరం గ్రామస్తులను శనివారం కాంగ్రెస్ ప్రభుత్వ అమలు సంక్షేమ పథకాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఉగాది పండుగను పురస్కరించుకొని .. సాయంత్రం కాచవరం గ్రామంలోని ఓం శ్రీ పార్వతి సమేత అమృత లింగేశ్వర స్వామి వారి దేవాలయంలో శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామస్తులతో ముచ్చటించారు. సందర్భంగా ప్రజల ఉద్దేశించి భట్టి విక్రమార్క మాట్లాడారు ...ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీల హామీల లో భాగంగా 2024 మార్చి నుంచి గృహజ్యోతి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నది. 200 యూనిట్ల లోపు విద్యుత్తు వాడుతున్న గృహ వినియోగదారులకు జీరో బిల్ వస్తున్నది. వీరికి సంబంధించిన డబ్బులను ప్రతినెల ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు చెల్లిస్తున్నది. అయితే ఈ పథకం ద్వారా కాచవరం గ్రామంలో ఎంత మంది లబ్ధి పొందుతున్నారు? విద్యుత్తు సరఫరా ఎలా ఉంది? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని గ్రామస్తులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 200 వరకు కుటుంబాలు ఉన్నాయని, 90 శాతం మంది అనగా దాదాపు 180 కుటుంబాలు జీరో బిల్లు ద్వారా లబ్ధి పొందుతున్నామని, గత ప్రభుత్వంలో కంటే మన ప్రభుత్వం విద్యుత్తు సరఫరా చాలా నాణ్యతగా ఇస్తున్నదని రైతులు ఆనందంతో చెప్పారు. కాచవరం గ్రామానికి సంబంధించి జీరో బిల్లులు , వ్యవసాయ కనెక్షన్లకు అందిస్తున్న ఉచిత కరెంటుకు సంబంధించిన విద్యుత్తు సబ్సిడీ డబ్బులను లబ్ధిదారుల పక్షాన 31 లక్ష రూపాయలు ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు చెల్లించిందని, ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీర్ అనూష ఉపముఖ్యమంత్రి కి వివరించారు. అక్కడ ఉన్న రైతులను ఉద్దేశించి రైతు భరోసా డబ్బులు మీ బ్యాంకు ఖాతాల్లో పడ్డాయా అని అడుగగా నాలుగైదు ఎకరాలు ఉన్న రైతులు అందరికీ రైతు భరోసా డబ్బులు బ్యాంకు ఖాతాల్లో పడ్డాయని సమాధానం చెప్పారు. మహాలక్ష్మి పథకం కింద వంటగ్యాసు సిలిండర్ ప్రభుత్వం 500 రూపాయలకే ఇస్తుందని, సబ్సిడీ డబ్బులు మీ బ్యాంకు ఖాతాలో పడుతున్నయా అని మహిళలను ఆరా తీశారు. గ్రామంలో 90 మంది కుటుంబాలకు వంట గ్యాస్ సబ్సిడీ డబ్బులు వచ్చాయని మహిళలు చెప్పారు. పొదుపు సంఘం లో ఉన్న మహిళలకు ఇందిరమ్మ డైరీ పథకంలో సబ్సిడీపై గేదెలను ఇస్తామని చెప్పారు. కాచవరం గ్రామంలో రేషన్ షాపు లేనందున లక్ష్మాపురం గ్రామానికి వెళ్లి తెచ్చుకోవడం ఇబ్బందిగా ఉందని గ్రామంలోనే రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. కొంతమంది మహిళలు తమకు ఇల్లు లేవని ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించాలని ఉప ముఖ్యమంత్రి కి విజ్ఞప్తి చేయగా, ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తి అయ్యిందని గ్రామంలో ఇంటి స్థలం ఉండి ఇల్లు లేనటువంటి వారికి ప్రాధాన్యత క్రమంలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇస్తామని వెల్లడించారు. ఇందిరమ్మ కమిటీలు పారదర్శకంగా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి జాబితాను పంపించాలని సూచించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ ఐలూరు వెంకటేశ్వర రెడ్డి, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు, బొగ్గుల గోవర్ధన్ రెడ్డి,కంచర్ల వెంకట నరసయ్య, షేక్ ఇస్మాయిల్, శీలం యూత్ నాయకులు వేజండ్ల సాయికుమార్, మల్లెల లక్ష్మణరావు, ఎస్ కే జాన్ బాషా, గుడేటి బాబురావు, యన్నం పిచ్చిరెడ్డి, పంబి శివ దేవరకొండ రాజీవ్ గాంధీ ,దేవరకొండ శ్రీను, వివిధ గ్రామాల అధ్యక్ష,కార్యదర్శులు ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com
సోమవారం 31, మార్చి 2025

# క్రీడాకారులకు ఉచితంగా వాలీబాల్ కిట్లు పంపిణీ చేసిన ఫజల్ బక్షి

### నేటి యువత చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలి





**చంద్రుగొండ, సూర్య (మేజర్ న్యూస్)–** యువ క్రీడాకారులకు అశ్వరావుపేట నియోజకవర్గ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఫజల్ బక్షి ఉచితంగా వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఆదివారం మండల పరిధిలోని బెండలపాడు గ్రామంలో ఉన్న యువకులకు ఆయన గ్రామ పెద్దలతో కలిసి వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేటి యువత చదువులతోపాటు క్రీడల్లో కూడా రాణిస్తూ గ్రామానికి దేశానికి మంచి పేరు తీసుకొస్తున్నారన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు క్రీడల్లో రాణించిన వారికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలతో పాటు తగిన గుర్తింపు కూడా ఇస్తుందని దీనిని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా దిశా కమిటీ సభ్యులు బొర్రా సురేష్, కాంగ్రెస్ నాయకులు కారం చిట్టిబాబు, సపోవట్ రాజేష్, ఓర్సు రామకృష్ణ, మాజీ సర్పంచు వీసం రాములు, యువ నాయకులు పొట్టా రాము, బోడ శ్రీను, ఆంగోతు రమేష్, ఆంగోతు కిషన్, రాయల నరేష్, గోగుల తిరుమలరావు, అయోధ్య రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేసిన ముస్లిం నాయకులు



**దమ్మపేట సూర్య (మేజర్ న్యూస్) –** పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా మందలపల్లి లోని గాంధీనగరం గ్రామ సమీపంలో ఇటుకల ఫ్యాక్టరీ వద్ద పనిచేస్తున్న కొందరు పేద ముస్లింలకు ముస్లిం సంఘ నాయకులు రంజాన్ తోఫా అయినటువంటి సేమియా, పాలు, పంచదార మొదలగు రంజాన్ కు ఉపయోగపడే వస్తువులను, ఖురాన్ లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పఠాన్ జానీ మాట్లాడుతూ దివ్య ఖురాన్ వెలువడిన రంజాన్ మాసంలో ఆకలి



దప్పికలకు ఓర్చి కఠినమైన నిష్ఠ తో అల్లాహ్ ఆజ్ఞను శిరసా వహించి 30 దినాలు ఉపవాసాలు అనంతరం ఎంతో సంతోషంగా కుటుంబ వ్యాప్తంగా జరుపుకుంటున్న రంజాన్ పండుగకు తమ వంతు బాధ్యతగా తూఫాను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. వేరే రాష్ట్రాల నుండి వలస ఈ ప్రాంతంలో పనులు చేసుకుంటున్న పేద ముస్లింలకు నిత్యవసర వస్తువులు రంజాన్ తోఫా అందించడం సంతోషకరంగా ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో మందలపల్లి మసీదు కమిటీ అధ్యక్షులు షేక్ అజీమ్, షేక్ అల్లాబక్షు, రషీద్,దమ్మపేట మసీద్ ఇమామ్ మహమ్మద్ ఫయాజ్,షేక్ మస్తాన్, పాల్గొన్నారు.

# వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉగాది వేడుకలలో పాల్గొన్న:– వైరా ఎమ్మెల్యే



**వైరాసూర్యమేజర్ న్యూస్ :** వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు ఉగాది పండుగ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి పంచాంగం శ్రవణం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ ఉగాది పండుగ పర్వదినాలు శ్రీ విశ్వనామ సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుతూ. వైరా నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ఈ రాబోయే సంవత్సరం రాష్ట్ర అభివృద్ధి రాష్ట్ర శ్రేయస్సు ని కోరుకుంటూ మంచి జరగాలని దేవుడికి వచ్చాక పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# యువత క్రీడల్లో రాణించాలి

### ఎమ్మెల్యే రాందాస్ నాయక్

### క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందచేసిన ఎమ్మెల్యే

### గరుడ క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులకు అభినందనలు



**జూలూరుపాడు,సూర్య(మేజర్ న్యూస్)** మండల కేంద్రంలో టీం గరుడ క్రికెట్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసాయి.. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్ వీక్షించేందుకు వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాలోత్ రాందాసు నాయక్ విచ్చేశారు. ఫైనల్లో విజయం సాధించిన విజేతలకు బహుమతులు ప్రధానం చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలని, వారింట్లోని నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. టీం గరుడ టోర్నమెంట్ నిర్వాహకులైన షేక్ షఫీ, కల్లోజి దినేష్, అజయ్ లను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, మండల అధ్యక్షులు మాలోత్ మంగీలాల్ నాయక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు దొండపాటి శ్రీనివాసరావు( వాసు), గరుడ టీం ఫౌండర్ మాలోత్ విగ్నేష్ నాయక్, తెలంగాణ ఉద్యమకారుడు వేల్పుల నరసింహారావు,రోకటి సురేష్, మిరియాల కిరణ్ కుమార్, మెంతుల కృష్ణ,లచ్చు నాయక్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గోటి తలంబ్రాలతో భద్రాచలంకు భక్తుల పాదయాత్ర



**లక్ష్మీదేవి పల్లి,సూర్య(మేజర్ న్యూస్)** మండల పరిధిలోని తెలగ రామవరం రామాలయం నుంచి గోటి తలంబ్రాలతో భక్తులు పాదయాత్రగా భద్రాచలం కు తరలి వెళ్లారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని గత పది రోజుల నుంచి గోటి తలంబ్రాలు తయారు చేసిన భక్తులు ఆదివారం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుంచి పాదయాత్రగా భద్రాచలం రామాలయంకు చేరుకొని ఆలయ ప్రధాన అర్చకులకు తలంబ్రాలను అందించి ప్రత్యేక పూజలు పాల్గొన్నారు .. ఈ పాదయాత్రలో భక్తులు చావల పురుషోత్తం, వ్యాసారపు నరసింహ ,నారసాని రమేష్, సంపత్ వేణు వేణు నాగ సన్విత్, బద్రి ,వంశీ, తదితరులు పాల్గొన్నారు

# గిరిజన కుటుంబాలతో ఉగాది పండుగ జరుపుకున్న మంత్రి తుమ్మల మనవడు ప్రయాగ్



**దమ్మపేట సూర్య (మేజర్ న్యూస్ )** మండల పరిధిలోని మారుమూల గిరిజన గ్రామం అయినటువంటి పూసుకుంట కట్కూరు గ్రామాలలో ఉన్న కొండరెడ్ల కుటుంబాలతో తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు మనవడు తుమ్మల ప్రయాగ్ గిరిజన కుటుంబాల నడుమ ఆదివారం సంతోషంగా గడిపారు ఈ సందర్భంగా గ్రామంలో ఉన్నటువంటి గిరిజన పిల్లలకు స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు, పిల్లల ఆట వస్తువులు, స్వీట్లు పంపిణీ చేశారు ఈ క్రమంలోనే గడపగడపకు తిరుగుతూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు రానున్న రోజులలో తమ గ్రామాలు అన్ని విధాల అభివృద్ధి చెందుతాయని మాట ఇస్తే మడమ తిప్పని తన తాత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గిరిజనుల కుటుంబాలలో వెలుగులు నింపడం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు ఈ దిశలోనే ప్రతి విద్యార్థి చదువులపై దృష్టి సారించి తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కొయ్యల అచ్యుతరావు, తదితరులు ఉన్నారు.

# ఇఫ్తార్ వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్





### ముస్లిం సోదరులకు పవిత్ర రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

**జూలూరుపాడు,సూర్య(మేజర్ న్యూస్)** జూలూరుపాడు జామా మస్జీద్ లో జరిగిన ఇఫ్తార్ వేడుకల్లో వేడుకలు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పాల్గొన్నారు. రంజాన్ నెల ప్రారంభమైన నాటి నుంచి 29 రోజులు నెలవంక కనిపించే వరకు కఠిన ఉపవాస(రోజా)దీక్షలు చేపట్టిన ముస్లిం సోదరులకు కజ్జురం తినిపించి విరమింప చేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పవిత్ర రంజాన్ పండుగ కులమతాలకతీతంగా జరుపుకోవడం జరుగుతుందన్నారు.మతసామరస్యానికి ప్రత్యేకగా రంజాన్ నిలుస్తుందని పేర్కొన్నారు. కటోర దీక్షల అనంతరం నెలవంకను చూసి రంజాన్ పండుగను నిర్వహించుకోవడం జరుగుతుందని మండల ప్రజలకు పవిత్ర రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.అల్లా కరుణ ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మాలోత్ మంగీలాల్ నాయక్,మాజీ ఎంపీటీసీ దుద్దుకురి మధుసూదనరావు,కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు నున్నా రంగారావు,యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంచర్ల హరీష్,వేల్పుల నరసింహారావు,దారావత్ బాలాజీ,హలావత్ రఘు,షేక్ మహబూబ్,జామా మజీద్ కమిటీ అధ్యక్షులు సయ్యద్ యాసీన్,మహబూబ్ పాషా,షేక్ రఫీ,రజాక్,మన్సూర్ వలి,జానీ (డ్రైవర్),బాబాజీ, సయ్యద్ జాన్ బాబు,షేక్ జాన్ బాబు,ఫరిద్ బాబా,సల్మాన్ ఖాన్,ముస్లిం సోదరులు సిద్ధిఖ్,కరీముల్ల,జానీ వలి అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కూనంనేని

**కొత్తగూడెం టౌన్, సూర్య(మేజర్ న్యూస్)–** భద్రాద్రి కొత్తగూడెం నియోజవర్గ ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటన రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసంలో ముస్లింలు కఠోర ఉపవాస దీక్షలు, ప్రార్థనలు, క్రమశిక్షణ పాటిస్తారని ఆయన పేర్కొన్నారు. ముస్లిం సోదరులు రంజాన్ మాస వేడుకలను సుఖసంతోషాలతో నిర్వహించుకోవాలని ఆయన కోరారు.



సూర్య www.suryaa.com

సోమవారం 31, మార్చి 2025

# మీడియా అండ్ కమ్యూనికేషన్స్ అడ్వైజర్‌గా అల్లం నారాయణ



**కొత్తగూడెం, సూర్య (మేజర్ న్యూస్):** తెలంగాణ సమాచార పౌర సంబంధాల శాఖలో మరో కీలక పరిణామం..! మీడియా అండ్ కమ్యూనికేషన్స్ అడ్వైజర్‌గా ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్, సీనియర్ పాత్రికేయులు అల్లం నారాయణను నియమించనున్నట్టు తెలిసింది. ఈ మేరకు తెలంగాణ కాంగ్రెస్ సర్కారు నిర్ణయం తీసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. అల్లం నారాయణకు కేబినెట్ ర్యాంకులో ఈ హెూదాను ప్రకటించే అవకాశాలున్నాయి. తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల తరపున కీలక పాత్ర పోషించిన ఆయనను సముచితంగా గౌరవించాలనే ఉద్దేశంతోనే సీఎం రేవంత్ సర్కారు భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఇటీవల ప్రొఫెసర్ కోదండరాం, అందెశ్రీ, సుద్దాల అశోక్ తేజలతో పాటు అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ వీసీగా ఘంటా చక్రపాణిలను ప్రజాపాలనలో సముచితంగా గౌరవించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తెలంగాణ ఉద్యమంలో, మీడియా రంగంలో విశేష సేవలందించిన అల్లం నారాయణ అనుభవాన్ని ప్రజాపాలనలో భాగస్వామ్యం చేయాలని రాష్ట్ర సర్కారు మీడియా అండ్ కమ్యూనికేషన్స్ అడ్వైజర్‌గా నియమించాలని భావిస్తున్నట్టు సమాచారం. త్వరలోనే అధికారిక ప్రకటన కూడా చేయనున్నట్టు తెలిసింది..

# కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఉగాది వేడుకలు







**సూర్య ప్రతినిధి ఖమ్మం :** శ్రీ విశ్వావసు నామ తెలుగు నూతన సంవత్సరం ఉగాది పర్వదిన వేడుకలు కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగాయి. స్వర్ణ భారతి కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో రాజశేఖర్ సిద్దాంతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొల్లు రఘు సత్యనారాయణ, చావా రాము దంపతులచే పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం పంచాంగ శ్రవణం చేశారు. ఈ సందర్భంగా వినూత్న రీతిలో వ్యవసాయ%శీ% చేస్తున్న, సామినేని హరిప్రసాద్, నెల్లూరి శేషగిరి, మంకేన రామకృష్ణ, పైడిపల్లి దశరథ్, తుమ్మల రాణా ప్రతాప్, ఏపూరి వెంకటేశ్వరరావు, సంక్రాంత్రి ప్రసాద్, మహిళా రైతు స్వాతి లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీజీఓ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, తానా మాజీ అధ్యక్షులు తాళ్ళూరి జయశేఖర్, గరికపాటి వెంకటేశ్వరావు, మందడపు సుధాకర్, నెల్లూరి చంద్రయ్య, బెల్లం మధు కమ్మ సంఘ ఉపాధ్యక్షులు కర్నాటి రమాదేవి, సహాయ కార్యదర్శి వజ్జా శ్రీనివాసరావు, కోశాధికారి తుళ్లూరి నిర్మల, కార్యవర్గ సభ్యులు మోతుకూరి సత్యనారాయణ, తుమ్మలపల్లి నాగేశ్వరరావు, నల్లమల ఆనంద్, మేదరమెట్ల స్వరూప రాణి, పోతినేని భూమేశ్వరరావు, కోలేటి నవీన్, నంబూరి ప్రసాద్, తాళ్ళూరి మురళీకృష్ణ, బండి రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రై కార్ ద్వారా సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమల స్థాపన









### గిరిజన మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

### బెల్లయ్య నాయక్

### ట్రిమిక్స్ ప్రాసెసింగ్ యూనిట్ సందర్శన

**భద్రాచలం ఐటీడీఏ, సూర్య(మేజర్ న్యూస్) –** ట్రై కార్ ద్వారా సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలు స్థాపించుకొని జీవనోపాధి కల్పించుకుంటున్న గిరిజన మహిళలు మీరు స్థాపించుకున్న పరిశ్రమలు సక్రమంగా నడుపుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందటమే కాక పదిమందికి మార్గదర్శకులుగా నిలవాలని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ ట్రైబ్స్ కోపరేటివ్ ఫైనాన్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ అన్నారు. ఆదివారం భద్రాచలంలోని శ్రీ లక్ష్మీ గణపతి న్యూట్రిమిక్స్ ప్రాసెసింగ్ యూనిట్ను ఆయన సందర్శించి తయారు చేస్తున్న న్యూట్రిమిక్స్ పదార్థాల వివరాలను మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో మార్కెటింగ్ సరిగా లేక మూతపడిన సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలను ఆర్థికంగా వెసులుబాటు కల్పించి తిరిగి ప్రారంభించుకోవడానికి ఐటీడీఏ ద్వారా చేయూత అందించినందున మహిళలు తప్పనిసరిగా ఈ పరిశ్రమలను బాగా నడిపి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. న్యూట్రిమిక్స్ తయారీ కోసం కొనుగోలు చేసే ముడి సరుకులు గ్రామాలలో హెూల్‌సేల్ ధరలకు కొనుగోలు చేసి కల్తీ లేకుండా పదార్థాలను తయారుచేసి మార్కెటింగ్ సౌకర్యం కల్పించుకుంటే ప్రతి పరిశ్రమ లాభాల బాటలో నడుస్తాయని, కొనుగోలు చేసిన ప్రతి ముడి సరుకు సంబంధించిన రికార్డులు సక్రమంగా నిర్వహించుకోవాలని అన్నారు. అనంతరం ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియంను సందర్శించి మ్యూజియం లోపల గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు ఆచార వ్యవహారాలకు సంబంధించిన ప్రతి కళాఖండాలను పరిశీలించి రాబోయే తరానికి గిరిజన కల్చర్ యొక్క ప్రతి అంశం తెలిసే విధంగా మ్యూజియంను ముస్తాబు చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. అంతరించిపోతున్న గిరిజన ఆచార వ్యవహారాలు కట్టుబాట్లు నేటి యువతకు అర్థమయ్యేలా అవగాహన కల్పించి గిరిజన సంస్కృతిని దేశ దేశాలకు విస్తరించే విధంగా సంబంధిత అధికారులు కృషి చేయాలని అన్నారు. అనంతరం దమ్మక్క జాయింట్ లియాబిలిటీ గ్రూప్ మహిళలకు వారి వ్యాపారాన్ని విస్తరించుకోవడానికి రూ 5 లక్షల చెక్కును మహిళలకు అందించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ట్రైకర్ మిషన్ మేనేజర్ లక్ష్మీప్రసాద్, ఎస్ ఓ భాస్కర్, ఏవో సున్నం రాంబాబు, ఏటీడీవో అశోక్ కుమార్, డీఎస్ఓ ప్రభాకర్ రావు, మేనేజర్ ఆదినారాయణ, మ్యూజియం ఇంచార్జ్ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# గొటి తలంబ్రాలతో భద్రాచలంకు భక్తుల పాదయాత్ర



**లక్ష్మీదేవి పల్లి, సూర్య(మేజర్ న్యూస్)** మండల పరిధిలోని తెలగ రామవరం రామాలయం నుంచి గోటి తలంబ్రాలతో భక్తులు పాదయాత్రగా భద్రాచలం కు తరలి వెళ్లారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని గత పది రోజుల నుంచి గోటి తలంబ్రాలు తయారు చేసిన భక్తులు ఆదివారం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుంచి పాదయాత్రగా భద్రాచలం రామాలయంకు చేరుకొని ఆలయ ప్రధాన అర్చకులకు తలంబ్రాలను అందించి ప్రత్యేక పూజలు పాల్గొన్నారు .. ఈ పాదయాత్రలో భక్తులు చావల పురుషోత్తం, వ్యాసారపు నరసింహ ,నారసాని రమేష్, సంపత్ వేణు వేణు నాగ సన్విత్, బద్రి ,వంశీ, తదితరులు పాల్గొన్నారు